# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 5.00

జులై 2022



మే నెల9 నుండి 14 వరకు శ్రీ కాళీవనాశ్రమము
హైదరాబాదుశాఖలో జరిగిన సత్సంగ సమావేశ దృశ్యములు.



సత్సంగ
సమావేశం



శ్రీ సద్గురు
పాదపూజ



సామూహిక
శ్రీ సద్గురు
పాదపూజలు

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ



సంపుటి 41 సంచిక 11
పేజీలు 44
జులై 2022

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో ............................ ....... పేజీ**


దాశరథీ శతకము ............................ .........4
శ్రీబాబూజీ ఉవాచ....................................... 5
అమ్మమాట.................................. ........... 7
అగస్త్య హృదయం ...................... .............9
శ్రీదండి స్వామి బోధ. .......................11
మాతృ పంచకం ............... ........................13
తండ్రి ఆశీర్వాదం .......................................15
ఆచార్య సద్బోధన..........................................17
మాతృ భిక్ష ........... ............ ........................18
భక్తుడు.... .........................................................21
ఖాతా ......................................... ........................25
కైవల్యోపనిషత్ ... ..........................................27
కర్మభూమి - భోగ భూమి .......................29
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు ....................31
శ్రీ మాతా కళావతీ దేవి...........................32
వివేక చూడామణి ............... ................34
అక్షయ తృతీయ................ ............................36
నిరీక్షణ .....................................................................37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ...... .......................... ...................41

## **దాశరథీ శతకము** - భద్రాచల రామదాసు

**24)** **రాముడు ఘోరపాతక విరాముడు సద్గుణకల్ప వల్లికా**
**రాముడు షడ్వికార జయరాముడు సాధుజనావన వ్రతో**
**ద్ధాముడు రాముడే పరమదైవము మాకని మీ యడుంగు గెఱ-**
**దామరలే భజించెదను దాశరథీ! కరుణాపయోనిధీ!**

భావం - పాపములను పోగొట్టువాడు, మంచి గుణములను కల్పవృక్షపు తీగెలకు తోటవంటివాడు, వికారములను జయించినవాడు, మంచివారిని రక్షించువాడునైన రాముడే ముఖ్యదేవుడుగా నీ అడుగులను పద్మముల గొలుతును దాశరథీ! కరుణాపయోనిధీ!




*డాకర్ చికిత్సకోసం డబ్బులు ఎందుకు తీసుకోలేదు?
*మనం ఆశించేది ఎలా వుండాలి?
*అక్కా చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళకు ఒకే ముహూర్తాన్ని ఎందుకు నిర్ణయించారు?
*రుద్రుడు అంటే అర్థం ఏమిటి?
*శ్రీ శంకరులు ప్రారబ్ధాన్ని ఎందుకు అంగీకరించలేదు?
*శ్రీమతి శివరావుగారి మెదడు వ్యాధి ఎలా తగ్గింది?
*ధరమ్‌పాల్ సుల్తాన్‌ని ఏం కోరుకున్నాడు?
*ప్రతిరోజూ లేగదూడలు ఎందుకు తప్పిపోయేవి?
*శిలా విగ్రహాలు సహజమూర్తులు ఎలా అయ్యాయి?
*మంత్రసాని నుండి తొలి భిక్ష స్వీకరించినదెవరు?

***సమాధానాలు లోపలి పేజీలలో ...........................***

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మాట్లాడుతూ "మీ కందరికి కాళీయమర్దన వృత్తాంతము తెలుసు కదా! శ్రీ కృష్ణ పరమాత్ముడు కాళీయుడిని శిక్షించినట్లా? లేక అనుగ్రహించినట్లా? పరమాత్ముడు అనుగ్రహ స్వరూపుడు కదా! ఏం దాస్ ఏమంటావు? పరమాత్ముడు ప్రేమమూర్తి కదా! ఆయన ఎవ్వరికైనా అపకారం తలపెడతాడా? కాళీయుడు శాపగ్రస్తుడు. అతని జన్మసంస్కారం పండి, శ్రీ కృష్ణ పరమాత్ముని పాదస్పర్శచేత ధన్యుడయ్యాడు.



కాళీయుడు సర్పరాజు. అహంకార మదాంధకారములతో కూడి, యమునా నది మడుగులో ఆశ్రయాన్ని ఏర్పరచుకొని, అక్కడికి చేరిన గోగణాన్ని, లేగదూడల్ని, గోపబాలురను హింసించటం మొదలుపెట్టాడు. ప్రతిరోజు లేగదూడలు తప్పిపోయేవి. కాళీయుడు చేరిన యమునానది మడుగులో జలచరాలన్నీ మృతిచెందాయి. ఆ మడుగులోకి చేరిన గోవులైనా, గోపబాలురైనా, ఎవరైనాసరే కాళీయుని హింసకి గురికావలసిందే.

ఒకరోజు గోపబాలురంతా చేరి, గోపాలకృష్ణునికి తమ బాధని విన్నవించారు. 'కృష్ణా! కాళీయుని బాధకి తట్టుకోలేకపోతున్నాము. నీవే మమ్మల్ని రక్షించాలి, లేకపోతే మాకు మరణము తప్పదు' అన్నారు. గోపాలకృష్ణుడు గోపబాలురతో యమునానది ఒడ్డున ఆడుకుంటున్నట్లుగా ఆడుకుని, ఆ ప్రక్కనే ఉన్న చెట్టునెక్కి, ఆ క్రిందనే ఉన్న కాళీయుడున్న మడుగులో దూకాడు. దూకిన వెంటనే అదృశ్యమయ్యాడు. గోపబాలురంతా కృష్ణా! కృష్ణా! అని శోకించారు. తమ గోపాలకృష్ణునికి ఏమైందోనని విలపించారు. సర్వజగత్తుని రంజింపజేసేవాడిని, కాళీయుని కోరలోని విషం ఏం జేస్తుంది? కాళీయుడు తన తోకతో శ్రీకృష్ణుని చుట్టి దేహమంతా విషపుకోరలతో కరిచాడు.

కాళీయుని విషమంతా శ్రీకృష్ణుని స్పర్శతో అమృతమయమైంది.

కాళీయుని దుష్టగుణాలన్నీ, సుగుణాలుగా మారిపోయాయి. అతనిలోని సత్త్వ రజ స్తమో గుణాలు హరింపబడ్డాయి. ఇంతలో శ్రీ కృష్ణుడు కాళీయుని శిరస్సుపైచేరి నాట్యం చేస్తుండగా, ఆ పాదస్పర్శతో ఆనందాన్ని పొందాడు. ఆ ఆనందాన్ని తాను పొందటమే కాక, అందరికి నేత్రానందాన్ని కల్గించటానికే అన్నట్లుగా, కాళింగుడు నీటిలోంచి పైకివచ్చి అందరికీ కృష్ణ పరమాత్మని దర్శన భాగ్యాన్ని కలగజేశాడు. కాళీయుడిలో అహంకార మమకారాలు హరించబడ్డాయి. ద్వైతభావం హరింపబడింది. అంతా ఏకత్వమే గోచరించింది. కాళీయునిలోని అజ్ఞానము హరించి జ్ఞానభిక్ష పెట్టాడు. శ్రీకృష్ణ పరమాత్మని పాదస్పర్శ పొందిన జన్మయే ధన్యము.

శ్రీకృష్ణ పరమాత్మని నాట్యాన్ని చూసిన పక్షులు కిలకిలారావాలు చేశాయి. గోగణాలు 'అంబా' అని అరిచాయి. గోపబాలురు తనువులు మరచి అలా నిశ్చేష్టులై నిలిచిపోయారు. అక్కడ ఉన్న లతలు, వృక్షాలు సైతం ఆనందంతో ఊగిసలాడాయి. యమునానది ఉప్పొంగింది. కాళీయుని చరిత్ర చిరకాలము నిలిచిపోయింది. పరమాత్మ శక్తి అటువంటిది. ఇప్పుడు మీరే చెప్పండి. కాళీయుడు శిక్షింపబడ్డాడా? అనుగ్రహింప బడ్డాడా? అయితే అది వారి భావననుబట్టి ఉంటుంది. "యద్భావం తద్భవతి" అన్నట్లుగా ఉంటుంది.

ఆ తర్వాత శ్రీ బాబూజీ తమ బాల్యంలో జరిగిన సంఘటనలను గూర్చి చెప్పారు. నేను బాల్యంలో దిరుసుమర్రులో నాన్నగారితో ఉన్న రోజులవి. దిరుసుమర్రులో నేను, లక్ష్మీపతి రాజుగారు, సత్తిరాజుగారు, నారాయణరాజుగారు, తాతంరాజుగారు, కరణంగారు కలిసి కూర్చున్నాము. వారంతా కలిసి, నన్ను ఏవో ప్రశ్నిస్తున్నారు. నేను వారు చెప్పిన వాటినన్నిటిని ఖండిస్తున్నాను. మా చర్చ రాత్రి 12గం॥వరకూ సాగింది. మేము చర్చ జరుపుతుండగా ఆ ఊరి పెద్దలంతా ఉన్నారు మాతో. ఇది ఇలా వుండగా ఆరోజు నాతో చర్చ జరిపే ఊరి పెద్దల సంతానము అంతా చేరి నన్ను ఎలాగైనా అవమానపరచాలని దురుద్దేశంతో నా దగ్గరకు వచ్చారు. 'ఈరోజు మీరు ఎలాగైనా మాతో భోజనం చేయటానికి రావాలి' అని పిలుచుకు వెళ్ళారు నన్ను. మేమంతా కలిసి హొటల్‌కి వెళ్ళాం. తర్వాత నన్ను వాళ్ళు బస్ ఎక్కించి తిరిగి వెళ్ళిపోయారు.

- సశేషం

## అమ్మ మాట

- జపమాలా ప్రసాద

***దేనిని ఆశించాలి?***

ఆషాఢ మాసం వచ్చిందీ అంటే, గురుభక్తులయినటువంటి వారందరికీ మొట్ట మొదటగా గుర్తుకు వచ్చే పండుగ శ్రీ గురుపూర్ణిమ. ప్రతినెలా పూర్ణిమ వచ్చినా, ఆ, కా, మా, వై - ఆషాఢ, కార్తీక, మాఘ, వైశాఖ పూర్ణిమలను మాత్రమే గురుపూర్ణిమలు అని ఎందుకు అంటున్నాము? అని చాలామందికి వచ్చే పెద్ద సందేహం. పూర్ణిమలన్నీ పూర్ణ తిథులే అయినా, ఈ నాలుగూ మాత్రమే ఎందుకు ప్రసిద్ధికెక్కాయి అంటే, పూర్ణపురుషులైన మహాత్ములు ఉద్భవించిన రోజులు కనుక వీటిని గురుపూర్ణిమలుగా పేర్కొన్నారు.



ఆషాఢ పూర్ణిమ వ్యాసమహర్షి ఉద్భవించిన రోజు కనుక ఆషాఢ పూర్ణిమ వ్యాస పూర్ణిమగా ప్రసిద్ధి చెందినది.

ఆ తరువాత కార్తీక పూర్ణిమ నాడు మహానుభావుడైన సిక్కు మతస్తుల మొట్ట మొదటి గురువైన శ్రీగురునానక్ వారి జన్మదినం.

మాఘపూర్ణిమ నాడు గౌతమ బుద్ధులవారు తమ యొక్క నిర్వాణం గురించి ప్రకటించిన రోజు కనుక అది గురుభక్తులైన వారికి అత్యంత పవిత్ర దినం. దీనిని మహామాఘీ అని కూడా అంటారు. ఈ దినం నాడే కుంభమేళా కూడా ప్రారంభించబడుతుంది. మా అఘ అంటే పాపం లేకుండా అంటే పాపాలను నశింపజేసే మాసం అని అర్థం. కనుక నిరంతర గురునామ స్మరణలో వుంటూ పుణ్యకార్యాలనే చేసేవారికి పాపమెక్కడ వుంటుంది?

ఇహపోతే వైశాఖ పూర్ణిమ. ఇది సాక్షాత్తు బుద్ధ భగవానుని జన్మదినం. కనుక దీనిని బుద్ధ పూర్ణిమ అని కూడా అంటారు.

కనుక ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకి, గురుభక్తులకి, గురుపరంపర యొక్క విశిష్ఠతను చాటిచెప్పే పవిత్ర దినాలు ఈ నాలుగు పూర్ణిమలు. ఉత్తర హిందూస్థాన్‌లో గురుభక్తి మెండు కనుక వారికి గురుపూర్ణిమల

యొక్క విశిష్ఠత బాగా తెలుసును అని శ్రీబాబూజీ మహరాజ్ ఎప్పుడూ చెబుతూ వుండేవారు. ఆ గురుపూర్ణిమల యొక్క విశిష్ఠతను మనకి తెలియజెప్పేవారు అస్మద్గురువరేణ్యులు సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీవర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారు. **న గురోరధికం తత్వమ్। న గురోరధికం తపః। న గురోరధికం జ్ఞానమ్। తస్మై శ్రీ గురవే నమః॥** - గురుదేవుని మించిన తత్వంగాని, తపస్సుగాని, జ్ఞానంగాని ఏవీ లేవు అని సాక్షాత్ ఆదిగురువైన సదాశివుడే గురుగీతలో శెలవిచ్చారు.

ఏది అనుభవిస్తే ఇక అనుభవించవలసినది లేదో, అట్టి గురుదేవుని సన్నిధిలో చేరాం. ఆయన మన ఏ కోరికనైనా తీర్చగలరు. కానీ, మనం దేనిని ఆశించాలి? మనం ఆశించేది ఎలా వుండాలి అంటే, ఇక ఆశించేది అంటూ ఏదీ లేకుండా వుండాలి అని. ఎందుకంటే ఆశలకు లోబడిపోయిన మానవుడు తన యొక్క ఆయుష్షు అయిపోతోందని గుర్తించడం లేదు. దానినే మహాత్ములు ఈ విధంగా చెప్పారు. **ఆశయా బద్ధ్యతే లోకే కర్మణా బహు చింతయాః ఆయుక్షీణం న జానాతి తస్మాత్ జాగ్రత! జాగ్రత!** అని హెచ్చరించారు. పరమాత్మ యొక్క అనుభవంలో మనం మాయను ఎలా ఛేదించాలో అన్న అన్ని విషయాలు గురుదేవులు మనకు తెలియజేస్తూనే వున్నారు. కానీ, అది గుర్తించకపోవడం వలనే మన ఆయువు క్షీణించిపోతున్నదని కూడా గుర్తించడం లేదు. ప్రొద్దున్న లేచినప్పటినుండీ అనేక చింతలలోపడి అసలయిన భగవచ్చింతన మరచిపోతున్నాము. కాలంతో బాటు కాలుడు మన వెనకనే వస్తున్నాడన్నది మరచిపోతున్నాం.

- సశేషం



# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**బ్రహ్మేనాచ్యుతేశాయ సూర్యాయాదిత్య వర్చసే।**
**భాస్వతే సర్వభక్షాయ రౌద్రాయ వపుషే నమః॥**

తాత్పర్యము - బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు సైతం మూలకారకుడవై, అమిత తేజస్సుతో విరాజిల్లే ఆదిత్యుడా! నీకు నమస్కారము. ప్రళయ కాలమందు లయకారకుడవై రుద్ర స్వరూపములో వెలుగొందే భాస్కరుడా! నీకు నమస్కారము.

ఈ శ్లోకము ద్వారా అగస్త్యులు గురుదేవుని పరబ్రహ్మ స్వరూపునిగా, వైశ్వానరునిగా, రుద్రాంశ సంభూతునిగా ఆవిష్కరిస్తున్నారు.

**బ్రహ్మేనాచ్యుతేశాయ** అంటూ సృష్టి స్థితి లయకారకులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు మూలమైన పరబ్రహ్మ స్వరూపముగా గురువుని అభివర్ణిస్తున్నారు. **గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః** అని గురుగీతలో చెప్పబడినది కూడా అదే కదా! ఆ గురుదేవుల ప్రకాశము పెంజీకటికవ్వల వెలిగే పరంజ్యోతి స్వరూపమని **సూర్యాయాదిత్య వర్చసే** అన్న ప్రస్తావన తెలియజేస్తోంది. శ్రీ బాబూజీ మహరాజ్ ఆ ప్రకాశమును నీ హృదయంలో వున్న **హృదయబాబుగా** దర్శించగలవన్న అభయమిచ్చారు.

**సర్వభక్షాయ** అంటూ అగస్త్యులు పరబ్రహ్మమునకు వుండే సమానత్వమును సూచిస్తున్నారు. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే అని అన్నమాచార్యులు కీర్తిస్తూ **కడగి ఏనుగు మీద కాయు ఎండొకటే, పుడమి శునకము మీద బొలయు నెండొకటే** అంటూ ప్రతిపాదించినదీ అదే! అన్ని ప్రాణులలో వైశ్వానరుని రూపంలో ప్రకాశిస్తూ అన్నిటినీ జీర్ణం చేయగలిగిన జగద్గురువుల శక్తిని అగస్త్యులు గుర్తుచేస్తున్నారు.

**రౌద్రాయ వపుషే నమః** అంటూ లయకారకుడైన రుద్రుడినే కాక, ఘోర రూపమును అఘోర రూపముగా మార్చగలిగిన గురుశక్తిని అగస్త్యులు తెలియజేస్తున్నారు. భక్తులకు నిరంతర రక్షణ కలుగజేస్తూ ప్రమాదముల నుండి కాపాడి శ్రీబాబు ప్రసాదించిన అనుభవాలు ఎన్నెన్నో!

రుద్ర శబ్దమును నిర్వచిస్తూ శ్రీ శంకర భగవత్పాదులవారు **ప్రణత దుఃఖ ద్రావకః** అంటూ దుఃఖ కారణమును నిర్మూలించగలిగిన పరమాత్మ శక్తిగా శలవిచ్చారు. ఆ దుఖ నివారణతోపాటుగా శాశ్వతానందమును ప్రసాదించగలిగినది కేవలం గురుదేవులు మాత్రమే అని ఈ శ్లోకం చెబుతున్నది.

శ్రీ సద్గురుదేవులను మనం ప్రీతితో **ఓం సర్వ దుఃఖ ప్రశమనాయ నమః** అని కొలుచుకునే నామములో దాగి వున్న అంతరార్థము అదే కదా!

- సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమవాసులు తనికెళ్ల మోహన్ లెనిన్ గారు 12-6-22 ఆదివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 83 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.



# శ్రీ దండి నిర్మలానందగిరి స్వామి బోధ

సేకరణ - రమణ ప్రసాద్

ఈ రోజు పవిత్రమైన రోజు, ఈ మాసమే పవిత్రము, ఎందుకనగా శంకర జయంతి, బుద్ధ జయంతి, హనుమజ్జయంతి ఈ మాసంలో వచ్చాయి. అందులో శ్రీ బాబూజీ మహరాజ్ వారి క్షీరశిలామూర్తి ప్రతిష్ఠ చేసిన రోజు కూడా రావటం విశేషం.

మనకు జగద్గురువులు ఇద్దరు - ద్వాపరయుగములో కారాగారంలో జన్మించిన వైష్ణవాంశ సంభూతుడు శ్రీకృష్ణుడు. ఈ యుగములో జన్మించిన శివాంశ సంభూతుడు శ్రీశంకర భగవత్పాదా చార్యులవారు. వీరు కేరళలో ఎర్నాకులము సమీపంలో వెలియనాడులో జన్మించారు. వీరు పెరిగినది కాలడి. శ్రీ శంకరులు రచించిన "వివేక చూడామణి" అనే ప్రకరణ గ్రంథంలో శ్రీ శంకరులు ప్రారబ్ధాన్ని అంగీకరించలేదు. ఎందుకనగా "నేను దేహము కాదు ఆత్మను"అని తెలిసుకొన్నవానికి ప్రారబ్ధమెక్కడిది?

"కనిపించేది లేదు. కనిపించనిది ఉన్నది" అన్నారు. కనిపించేది ప్రపంచము, కనిపించనిది బ్రహ్మము. అయితే ఈ ప్రపంచము లేదా? "ఉన్నదనుకున్నవానికి ఉన్నది. లేదనుకున్నవానికి లేదు" అని మా గురుదేవులు చెప్పారు. **సత్తు చిత్తు ఆనందం; అస్తి భాతి ప్రియం "అహం బ్రహ్మాస్మి"** అని అనుభవపూర్వకంగా తెలుసుకున్న జ్ఞానికి దేహమూ లేదు, ప్రపంచమూ లేదు. వ్యాధి దేహానికి వస్తుంది. దేహం తాను - అనుకునేవాడికి ప్రారబ్ధ కర్మ ఉంది. నిద్రలో దేహ ధ్యాస లేదు కాబట్టి నీకు బాధ లేదు నాహం దేహః - అనుకున్నవాడికి ప్రపంచము లేదు. అతడు జీవన్ముక్తుడు. నీవెవరు? సచ్చిదానంద స్వరూపుడైన బ్రహ్మవు. సుఖ దుఃఖాలు, ఆకలి దప్పులు, జరామరణాలు ఎవరికి? శరీరం తాననుకొనేవానికి. ఈ ప్రారబ్ధమనేది శరీరానికి గాని "తాను"కి లేదు.

గురువులను నమ్మితే వారు ప్రారబ్ధాన్ని తేలిక చేస్తారు. గాలిలో మోసేవాడికి బరువెక్కువ నీటిలో మోసేవాడికి బరువు తక్కువ. పాము కరిచే చోట చీమ కరుస్తుంది. ఆ విధంగా నీ ప్రారబ్ధ కర్మను తీసివేస్తారు గురువులు. కృతయుగంలో తరించటానికి "తపస్సు" అయితే త్రేతాయుగంలో యజ్ఞ యాగాదులు. అలాగే ద్వాపరంలో దాన ధర్మాలు.

ఈ కలియుగంలో "కలౌ కేశవ కీర్తనమ్", "కలౌ స్మరణాత్ ముక్తిః" అన్నారు. అంతేకాదు, ఈ కలియుగంలో మనం నాలుగు సాధనలూ చేస్తున్నాం. **శ్లోకార్థే ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథ కోటిభిః। బ్రహ్మ సత్యం జగన్మిథ్య జీవో బ్రహ్మైవ న పరః॥** జగత్తు లేదు అనలేదు. జగత్తు కాదు. ఉన్నది బ్రహ్మమే. అని చెప్పారు శ్రీ శంకరులు. ఉదాహరణ : మట్టితో కుండలు చేస్తాం. ఉన్నది మట్టే. అలాగే బంగారంతో ఎన్నో ఆభరణాలు చేస్తాం. కాని వున్నది బంగారమే. సత్తు చిత్తు ఆనందాలు బ్రహ్మలక్షణాలు; నామరూపాలు జగత్తు లక్షణాలు. **దేహినో౽ స్మిన్ యథాదేహే కౌమారం యౌవనం జరా। తథా దేహాంతర ప్రాప్తిః ధీరస్తత్ర న ముహ్యతి॥** 2/13

ఈ శరీరమునకు బాల్య, యౌవన, వార్ధక్యములు ఎట్లు కలుగుచున్నవో, అట్లే మరణానంతరము ఈ శరీరము మరియొక శరీరమును పొందుచున్నది. కాని బ్రహ్మము మారేది కాదు. జగత్తు బ్రహ్మమే. కనపడే నామరూపాలు మిథ్య. ఇది అజ్ఞానం వల్ల వచ్చింది. జ్ఞానం లేకపోవటమే అజ్ఞానం. ప్రకాశం లేకపోవటమే చీకటి.

**అజ్ఞానేన ప్రభవం సర్వం జ్ఞానేన విలీయతే।** జగత్తు బ్రహ్మమే. జీవుడు బ్రహ్మమే. అహం ఉంటే జీవుడు. అహం తొలగిస్తే బ్రహ్మమే. పొట్టు ఉంటే వడ్ల గింజ. పొట్టు తొలగితే బియ్యపు గింజ. అహం అనే పొట్టు ఉంటే జీవుడు. అది పోతే బ్రహ్మ. అందుచేత అహం తొలగించుకో! అహం గురుబోధా శ్రవణం వల్ల పోతుంది. **శ్రుతం హరతి పాపాని।** గురువుని ఆశ్రయించు! గురు సేవ చేసుకో! గురు బోధ విను! గురువు ఆశీర్వాదం ఉంటే సమస్త దేవతల కృప ఉంటుంది. "నేను బ్రహ్మానంద స్థితిలో ఓలలాడుతున్నా. ఆ స్థితికి మీరు రావాలనేదే నా ఆశ" అంటున్నారు గురుదేవులు.

నువ్వు జీవుడివి కాదు బ్రహ్మమే. ఈ క్షణం బ్రహ్మ అనుకుంటే నువ్వు బ్రహ్మవే. బ్రహ్మమంటే అర్థం - దేహ ధ్యాస లేకపోవటమే. అయితే ఆ విశ్వాసం మీకు ఉండాలి. దేహ స్మృతి లేకుండా బ్రహ్మత్వమునందు ఓలలాడదాం. శ్రీ శంకరులు జన్మించిన రోజు. మన బాబూజీ విగ్రహ ప్రతిష్ఠ రోజు. అందువలన ఈ రోజు అతి పవిత్రమైన రోజు. గురుకృప, అమ్మ దయ ఉంటే అన్నీ అయిపోతాయి. గురుదేవుల ఆశీస్సులు మీపై వర్షించుగాక! సుఖీభవ!

# మాతృ పంచకం

సేకరణ - సన్నిధానం కాళీమాత

**ముక్తామణిస్త్వం నయనం మమేతి**
**రాజేతి జీవేతి చిరం సుత త్వం**
**ఇత్యుక్తవత్యాస్తవవాచి మాతః**
**దదామ్యహం తండులమేవ శుష్కమ్.**

అమ్మా! "నువ్వు నా ముత్యానివిరా! , నా రత్నానివిరా!, నా కంటి వెలుగువు నాన్నా! నువ్వు చిరంజీవిగా ఉండాలి" అని ప్రేమగా నన్ను పిలిచిన నీనోటిలో - ఈనాడు కేవలం ఇన్ని శుష్కమైన బియ్యపు గింజలను వేస్తున్నాను. నన్ను క్షమించు.

**అంబేతి తాతేతి శివేతి తస్మిన్**
**ప్రసూతికాలే యదవోచ ఉచ్చైః**
**కృష్ణేతి గోవింద హరే ముకుందే**
**త్యహెూ జనన్యై రచితోయమంజలిః.**

పంటిబిగువున నా ప్రసవ కాలములో వచ్చే ఆపుకోలేని బాధను "అమ్మా! అయ్యా! శివా! కృష్ణా! హరా! గోవిందా!" అనుకొంటూ భరించి నాకు జన్మనిచ్చిన తల్లికి నేను నమస్కరిస్తున్నాను.

**ఆస్తాం తావదియం ప్రసూతిసమయే దుర్వార శూలవ్యథా**
**నైరుచ్యం తనుశోషణం మలమయీ శయ్యా చ సంవత్సరీ**
**ఏకస్యాపి న గర్భభార భరణ క్లేశస్య యస్యాక్షమః**
**దాతుం నిష్కృతిమున్నతోపి తనయః తస్మై జనన్యై నమః.**

అమ్మా! నన్ను కన్న సమయంలో నువ్వు ఎంతటి శూలవ్యథను (కడుపునొప్పి) అనుభవించావో కదా! కళను కోల్పోయి, శరీరం శుష్కించి ఉంటుంది. మలముతో శయ్య మలినమైనా, ఒక సంవత్సరకాలం ఆ కష్టాన్ని ఎలా సహించావోకదా! ఎవరూ అలాంటి బాధను సహించ లేరు. ఎంత గొప్పవాడైనా కుమారుడు తల్లి ఋణాన్ని తీర్చుకోగలడా? నీకు నమస్కారం చేస్తున్నాను.

**గురుకులముప సృత్య స్వప్న కాలే తు దృష్ట్వా**
**యతి సముచితవేషం ప్రారుదో త్వముచ్చైః**

**గురుకులమథ సర్వం ప్రారుదత్తే సమక్షం**
**సపది చరణయోస్తే మాతరస్తు ప్రణామః.**

కలలో నేను సన్యాసివేషంలో కనబడేసరికి బాధ పడి, మా గురుకులానికి వచ్చి పెద్దగా ఏడ్చావు. ఆ సమయంలో నీ దుఃఖం అక్కడి వారందరికీ బాధ కలిగించింది. అంత గొప్పదానివైన నీ పాదాలకు నమస్కరిస్తున్నాను.

**న దత్తం మాతస్తే మరణ సమయే తోయమపివా**
**స్వ ధా వా నో దత్తా మరణదివసే శ్రాద్ధవిధినా**
**న జప్త్వా మాతస్తే మరణసమయే తారక మను-**
**రకాలే సంప్రాప్తే మయి కురు దయాం మాతురతులామ్.**

అమ్మా! సమయం మించిపోయాక వచ్చాను. నీ మరణసమయంలో కొంచెం నీళ్ళు కూడా నేను నీగొంతులో పోయలేదు. శ్రాద్ధవిధిని అనుసరించి "స్వధా"ను ఇవ్వలేదు. ప్రాణము పోయే సమయంలో నీ చెవిలో తారకమంత్రాన్ని చదవలేదు. నన్ను క్షమించి, నాయందు దేనితో సమానము కాని దయ చూపించు తల్లీ.

జయ జయ శంకర ! హర హర శంకర !

***పెదనింద్రకాలను శాఖలో కార్యక్రమాలు***

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**జులై 2022**

10 ఆది - తొలి ఏకాదశి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

13 బుధ - ఆషాఢ పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

23 శని - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

**ఆగస్ట్ 2022**

12 శుక్ర - శ్రావణ పూర్ణిమ, రాఖీ - శ్రీసద్గురుపాదపూజ.

19 శుక్ర - శ్రీకృష్ణాష్టమి - శ్రీసద్గురుపాదపూజ.

21 ఆది - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ

31 బుధ - శ్రీవినాయక చవితి - శ్రీసద్గురుపాదపూజ.

# తండ్రి ఆశీర్వాదం

(గత సంచిక తరువాయి)

సుల్తాన్ అతన్ని వ్యాపారవేత్తగా భావించి తగిన గౌరవంతో మాట్లాడటం ప్రారంభించాడు. సుల్తాన్‌తో పాటు వందలాది మంది సైనికులు ఉన్నారు కానీ, ఎవరి వద్దా కత్తులు కానీ తుపాకులు కానీ లేకపోవడం ధరమ్ పాల్ గమనించాడు. బదులుగా, వారందరూ తమతో పాటు భారీ జల్లెడలను తీసుకువెళ్తున్నారు. అతనికి చాలా ఆశ్చర్యంగా, ఆసక్తిగా అనిపించింది. వినయంగా సుల్తాన్‌ను, "మీ సైనికులు జల్లెడలను ఎందుకు మోస్తున్నారు?" అని అడిగాడు. సుల్తాన్ నవ్వుతూ ఇలా అన్నాడు, " నేను ఈ ఉదయం సముద్రతీరాన్ని సందర్శించడానికి వచ్చాను, ఇక్కడ ఎక్కడో నా వేలి నుండి ఉంగరం జారిపడిపోయింది. ఇప్పుడు, ఈ ఇసుకలో సరిగ్గా ఎక్కడ పడిందో గుర్తించడం కష్టం, కాబట్టి నేను నా సైనికులను వెంట తెచ్చుకున్నాను. వారు ఇసుకను జల్లించి నా ఉంగరాన్ని వెతుకుతారు." అన్నాడు. 'ఆ ఉంగరం చాలా ఖరీదైనదని అయ్యుండాలి' ధరమ్ పాల్ అన్నాడు. అలా కాదని సుల్తాన్ ఇలా చెప్పాడు, "నా దగ్గర దానికంటే చాలా విలువైన, లెక్కలేనన్ని ఉంగరాలు ఉన్నాయి, కానీ ఆ ఉంగరం ఒక సాధువు యొక్క ఆశీర్వాదం. ఆ సాధువు ఆశీర్వాదం వల్ల నా సల్తనత్ చాలా ధృడంగా, సంతోషంగా ఉందని నేను నమ్ముతున్నాను, కాబట్టి నా మనస్సులో ఆ ఉంగరం విలువ నా సల్తనత్ కంటే ఎక్కువ!". అప్పుడు సుల్తాన్ మళ్ళీ వ్యాపారం గురించి మాట్లాడటం ప్రారంభించి, "అయితే, ఈసారి ఏ వస్తువులు తెచ్చావు?" అని అడిగాడు. "లవంగాలు", అన్నాడు ధరమ్ పాల్.

అది విని సుల్తాన్ ఆశ్చర్యపోయాడు. "ఇది లవంగాల దేశం, మీరు ఇక్కడ లవంగాలు అమ్మడానికి వచ్చారా? మీకు అలాంటి సలహా ఎవరు ఇచ్చారు? ఖచ్చితంగా, ఆ వ్యక్తి మీ శత్రువు అయి ఉండాలి! ఇక్కడ, మీరు ఒక పైసాతో గుప్పెడు లవంగాలను కొనుక్కోవచ్చు. ఇక్కడ మీ నుండి లవంగాలు ఎవరు కొంటారు, ఇంక మీరు ఏం సంపాదిస్తారు?" ధరమ్ పాల్, "నేను అదే పరీక్షించాలనుకుంటున్నాను ప్రభూ! నేను ఇక్కడ ఏమైనా లాభం పొందగలనో లేదో చూడాలి. నాన్నగారి ఆశీర్వాదంతో ఇప్పటి వరకు నేను ఏ వ్యాపారం చేసినా లాభసాటిగా సాగింది. కాబట్టి, ఇప్పుడు ఆయన ఆశీస్సులు ఇక్కడ కూడా

పనిచేస్తాయో లేదో చూడాలనుకుంటున్నాను." సుల్తాన్ ఇలా అడిగాడు, "తండ్రి ఆశీస్సులా! అంటే దాని అర్థం ఏమిటి?!"

అప్పుడు ధరమ్ పాల్ అతనికి వివరించాడు, "మా తండ్రి ఆయన జీవితమంతా నిజాయితీ, చిత్తశుద్ధితో పనిచేశారు, కానీ డబ్బు సంపాదించలేకపోయారు. మరణ సమయంలో నా చేతిపై చేయివేసి, నీ చేతిలోని ధూళి కూడా బంగారంగా మారాలని ఆశీర్వదించారు", అని ఆ మాటలు మాట్లాడుతూ, ధర్మపాల్ వంగి నేల నుండి గుప్పెడు ఇసుక తీసుకున్నాడు. ఇసుకను తన వేళ్ళ మధ్య జారిపోనిస్తూ, సుల్తాన్ ముందు గుప్పిటను తెరిచేసరికి, ధర్మపాల్, సుల్తాన్ ఇద్దరి కళ్ళు కూడా ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. ఇసుక మొత్తం జారిపోయిన తర్వాత ధరమ్ పాల్ చేతిలో వజ్రం పొదిగిన ఉంగరం మిగిలిఉంది. సుల్తాన్ వెతుకుతున్న ఉంగరం ఇదే. అతను ఉంగరాన్ని చూసి చాలా సంతోషించాడు. "ఇది మహాద్భుతం ! ఓ అల్లా , చాలా కృతజ్ఞతలు, మీరు ఒక తండ్రి ఆశీస్సులను నిజం చేశారు!". అదే భగవంతుడు సాధువు ఆశీస్సులకు కూడా శక్తిని ప్రసాదిస్తాడని ధరమ్‌పాల్ అన్నాడు. అది విన్న సుల్తాన్ మరింత సంతోషించాడు. అతను ధరమ్‌పాల్‌ని కౌగిలించుకొని, "ఇవాళ నువ్వు ఏది కోరుకుంటే అది ఇస్తాను" అన్నాడు.

ధరమ్‌పాల్ ఇలా అన్నాడు, "నువ్వు 100 ఏళ్లు జీవించి, నీ ప్రజలను బాగా చూసుకోగాక! ప్రజలు సంతోషంగా ఉండాలని నేను కోరుకుంటున్నాను, నాకు మరేమీ అక్కర్లేదు." సుల్తాన్ అది విని ఉప్పొంగిపోయి, "నేను ఈరోజు మీ వస్తువులన్నీ కొంటాను. మీరు కోరుకున్నంత ధర ఇస్తాను", అన్నాడు. కాబట్టి, ధరమ్ పాల్ తండ్రి ఆశీర్వాదం అక్కడ కూడా అతనిని విఫలం చేయలేదు. తల్లిదండ్రుల ఆశీస్సులకు అపారమైన శక్తి ఉందని, వారి ఆశీస్సుల కంటే గొప్ప సంపద మరొకటి లేదన్నది వాస్తవ సత్యం. వారి సేవలో గడిపిన ప్రతి క్షణం ఫలాన్ని ఇస్తుంది. మన పెద్దలను గౌరవించడమే భగవంతునికి మనం చేసే ఉత్తమమైన సేవ. ఈ ప్రపంచం అంతా అనేకమైన అవకాశాలతో నిండి ఉంది. సాధ్యమయ్యే సంఘటనకు అవకాశం ఎలాగూ ఉంటుంది, కానీ అత్యద్భుతమైన విషయం ఏమిటంటే, అసాధ్యమైన సంఘటన సాధ్యమయ్యే అవకాశం కూడా ఉంది.

# ఆచార్య సద్బోధన

సేకరణ - భీమవరం గుప్తా

వజ్రం మట్టిలో ఉన్నా, హారంలో ఉన్నా దాని విలువలో మార్పు ఏమీ వుండదు. అలానే భక్తుడైనవాడు కష్టాలలో ఉన్నా సుఖములలో ఉన్నా కూడా తనలోని ఆధ్యాత్మికతను మార్పు చేసుకోకూడదు.

సుఖములలో ఉన్నపుడు ఎగిరి గంతేయడం, దేవుణ్ణి పొగిడేయడం, కష్టాల్లో ఉన్నపుడు నిరాశ పడడం, దేవుణ్ణి నిందించడం చేయకూడదు. ఇది భక్తుని లక్షణం కాదు.

భక్తుని అసలైన లక్షణం స్థిరత్వం. స్థిరత్వం ఉన్నచోటే దేవుడు వుంటాడు. ఎక్కడ దేవుడు ఉంటాడో అక్కడ సకల ఐశ్వర్యాలు కొలువై ఉంటాయి.

అది మనిషి హృదయం కానివ్వండి లేదా గృహము కానివ్వండి ఏదైనా సరే స్థిరమైన భక్తి విశ్వాసాలు ఉన్నచోటు శ్రీహరి నిలయమే అవుతుంది.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమవాసులు అయిన మంతెన వేంకట సత్యసాయి కృష్ణంరాజు గారు 26-5-2022 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 52 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

## మాతృ భిక్ష

సేకరణ - నూనె రంగడు

ఇది దాదాపు 175 సంవత్సరాల క్రితం భారతదేశంలో జరిగిన యదార్థ సంఘటన. వెనుకబడిన కులానికి చెందిన ధని అనే ఒక స్త్రీ వుండేది. ఆమె చాలా దయ గలది. ఆమె గ్రామ కమ్మరి భార్య. బిడ్డ పుట్టినప్పుడు సహాయపడే ఒక మంత్రసానిగా పనిచేసేది.

ఆ రోజుల్లో ఒకసారి ఒక బ్రాహ్మణుని ఇంట్లో బిడ్డ పుట్టాడు. ఈ బిడ్డ పుట్టడంతో కామర్పుకూరు ఊరి వాతావరణంలో ఒక మార్పు వచ్చినట్లు అయింది. అంతటా పక్షుల కిలకిలారావాలు వినిపించాయి. పువ్వులు వికసించాయి. ఊళ్ళో చెట్లకు కొత్త ఆకులు రావడం మొదలైంది. ప్రతి ఒక్కరి హృదయాన్ని ప్రశాంతపరిచే విధంగా వాతావరణం మారింది. ఆ బిడ్డ పుట్టుక ఆనందాన్ని తీసుకువచ్చింది. కుటుంబం మొత్తానికి ఇంకా ఎక్కువ సంతోషాన్ని తెచ్చింది.

ధని అక్కడ మంత్రసానిగా, సంరక్షకురాలిగా పని చేయడం ప్రారంభించింది. ఆ బిడ్డను చూసుకునేది. కాలక్రమేణా ఆమెకు ఆ శిశువుతో ఒక అనుబంధం ఏర్పడింది. ధని ఆ చిన్నారిని ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా చూసుకునేది. ఆ పిల్లవాడు కూడా ఆవిడతో ఒక భిన్నమైన, మాతృ సంబంధాన్ని పెంచుకున్నాడు. ధనీకి కూడా ఆ బిడ్డతో చెప్పలేని ఒక భావోద్వేగ బంధం ఏర్పడింది.

చూస్తూండగానే ఆ అబ్బాయికి 9 ఏళ్ళు వచ్చాయి. ఒకరోజు మంత్రసాని ఆ బ్రాహ్మణ బాలుడితో ఎంతో ఆప్యాయంగా మాట్లాడటం కనిపించింది. ఒక తల్లి ఏదో బాధ్యతను కోరుతున్నట్లుగా, పిల్లవాడు ఆమెకు వాగ్దానం చేస్తున్నట్లుగా కనిపించింది. తరువాత ఆ మంత్రసాని చెమ్మగిలిన కళ్ళతో అక్కడి నుండి వెళ్ళిపోయింది.

9 సంవత్సరాల తరువాత, ఆ బాలుడి కుటుంబ సభ్యులు అతనికి ఉపనయన కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ఆ కుర్రవాడి అన్నగారు ఆ ఆచారం, దాని ప్రవర్తనా నియమావళి యొక్క అంతర్భావాల గురించి అతనికి సూచనలు ఇస్తున్నాడు.

మాతృభిక్ష - తల్లి నుండి భిక్ష అనేది ఉపనయనంలో ఒక ముఖ్యమైన ముగింపు కార్యం. (మగ శిశువుకు ఒక నిర్దిష్టమైన వయస్సు

వచ్చినప్పుడు, అతనికి పవిత్రమైన దారాన్ని అంటే యజ్ఞోపవీతాన్ని శరీరంపై వికర్ణంగా ధరింపజేయడం బ్రాహ్మణులలో ఒక ముఖ్య ఆచారం. గాయత్రి మంత్రం కూడా అతనికి చెప్పబడుతుంది. ఆ వేడుక బాలుడి జీవితంలో అత్యంత ముఖ్యమైన సందర్భాలలో ఒకటి, ఎందుకంటే ఈ వేడుక తరువాత మాత్రమే బాలుడు సంపూర్ణ బ్రాహ్మణుడు అవుతాడని ఒక నమ్మకం. ఈ సమయంలో బాలుడు తన తల్లి నుండి మొదటి భిక్షను (ఒక పాత్రతో అన్నం, పండ్లు) అందుకుంటాడు. తల్లే అతనికి మొదటి ఆశీర్వాదం ఇస్తుంది. ఇది ప్రతి తల్లికీ చాలా గర్వకారణమైన విషయం.

అన్నయ్య ఆచారం గురించి చెబుతుంటే ఆ పిల్లవాడు ఇలా అన్నాడు 'నేను ధని అమ్మ నుండి మొదటి భిక్ష తీసుకుంటాను. అలా నేను ఆమెకు వాగ్దానం చేశాను'. వారిది సనాతన కుటుంబం అయినందున, అన్నయ్య భయపడుతూ ఇలా అన్నాడు, 'అది చాలా అసాధారణమైనది. ఆ మంత్రసాని ధని అమ్మ దగ్గర నుండి మొదటి భిక్ష తీసుకుంటే గ్రామ పండితుల మధ్య మన గౌరవం పోతుంది'.

ఆ అమాయకపు పిల్లవాడు వెంటనే ఇలా బదులిచ్చాడు, 'సోదరా! ఈ వేడుకలో ధని అమ్మకి నా తల్లిగా హక్కు ఇస్తానని నేను వాగ్దానం చేశాను. ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోతే, నేను ఈ పవిత్ర యజ్ఞోపవీతానికి అర్హుడను కాను'. అన్నగారు ఆ మాటలను నమ్మలేకపోయాడు. త్వరలోనే ఆ పవిత్రమైన రోజు రానే వచ్చింది. మంత్రోచ్ఛారణలు, శ్రావ్యమైన సన్నాయి వాయిద్యాల మధ్య వేడుక చక్కగా ప్రారంభమైనది. చుట్టాలు, ఇరుగుపొరుగువారు, మిత్రులు అందరూ ఉత్సాహంగా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ హడావిడిలో ఇంతకుముందు వారిద్దరికీ జరిగిన చర్చను తమ్ముడు మరచిపోయాడేమో అని అన్నగారు అనుకున్నాడు.

మరి కొద్దిసేపటిలో మాతృభిక్ష ఆచార కార్యక్రమం ప్రారంభం కానుంది. కుర్రవాడి తల్లి, ఇతర స్త్రీలు భిక్ష ఇవ్వడానికి సిద్ధం అయ్యారు. కానీ, భిక్ష ఇవ్వడానికి కొంత బియ్యం, పండ్లతో దూరంగా ఒక మూల నిలబడి వున్న ధని అమ్మ వైపు ఆ కుర్రవాడు చేతిలో భిక్ష సంచితో నడుస్తూ వెళ్ళగా, అక్కడి వారందరూ అలా చూస్తూ వుండిపోయారు. బ్రాహ్మణ పండితులందరూ చూస్తూ వుండగా, స్త్రీలందరూ నిర్ఘాంతపోయి

నిలబడిపోగా, సమాజంలో అంటరానితనం తారాస్థాయిలో వున్న ఆ సమయంలో, ఆ అమాయక బాలుడు, తాను ధని అమ్మకు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చడానికి ఆమె ముందు వంగి, ఒక వెనుకబడిన కులానికి చెందిన స్త్రీ అయిన ధని నుండి మొదటి మాతృభిక్షను అందుకున్నాడు! కళ్ళ నీళ్ళతో, హృదయంలో మాతృప్రేమ వుప్పొంగుతుండగా, ధని ఆ బిడ్డకు తన ఆశీస్సులు ఇచ్చింది. ఆ నిరుపేద తల్లికి, ఆమె జీవితంలో వున్న కోరిక ఇదొక్కటే!

ఈ వేడుకలలో అటువంటి సంఘటన జరిగినప్పుడు, దాని గురించి పెద్ద రభస, అలజడి జరుగుతుందని అందరూ ఊహించారు. కానీ అలాంటిదేమీ జరుగలేదు. ఆ వేడుకకు సంబంధించిన ప్రధాన పండితుడు మాత్రం ఆ పిల్లవాడి, సత్యవాక్య పరిపాలన గురించి ప్రశంసించి, హృదయపూర్వకంగా ఆశీర్వదించారు.

ఈ చిరస్మరణీయమైన నిశ్శబ్ద విప్లవం పశ్చిమ బెంగాల్లోని ఒక చిన్న గ్రామంలో జరిగింది. ఈ నిశ్శబ్ద విప్లవాన్ని తీసుకువచ్చిన బాలుడు గదాధర్ చటోపాధ్యాయ అతనే తరువాత రామకృష్ణ పరమహంసగా ప్రాచుర్యం పొందాడు. ఈ అన్యోన్యమైన ప్రేమను, ఆప్యాయతల బీజం ఒక పేద స్త్రీ యొక్క మాతృప్రేమ నుండి అతనిలో ఉద్భవించి వుండవచ్చు. బహుశ అదే రామకృష్ణ పరమహంస యొక్క ఔన్నత్యానికి పునాది వేసి వుంటుంది. తరువాత సమయంలో స్వామి వివేకానంద ఆయన ప్రధాన శిష్యుడు అయ్యాడు.

మనలో నిజమైన ప్రేమ పెంపొందితే, అందరూ సమానంగా కనిపిస్తారు. ప్రేమ అంతిమ లక్ష్యానికి మార్గాన్ని సులభతరం చేస్తుంది, ఎందుకంటే ప్రేమ ఒక అత్యుత్తమమైన శక్తి. ప్రేమను పెంపొందించుకోవడానికి ఏకైక మార్గం నిరంతర స్మరణ. మీరు ప్రేమతో మాత్రమే హృదయాలను గెలుచుకోగలరు. దానికి ఇంకో మార్గం లేదు.


...గత నెల తరువాయి
భక్తుడు
మధుప
అది సరే కానీ నారదా! మన ద్వారకకు పెద్ద ఆపద వచ్చింది. అది మహాభక్తుడవైన నీవే నివారించగలవు.
ఇప్పటికైనా నేను మహాభక్తుడనని ఒప్పుకున్నారు!
అలాగా! ఏం చెయ్యాలో చెప్పండి స్వామీ!
1
చిన్న పనే! నువ్వు ఒక నిండా నింపిన నూనె గిన్నెను తలపై పెట్టుకొని ఒక్క చుక్క కూడా క్రింద పడకుండా ద్వారక చుట్టూ ప్రదక్షిణం చేసి రావాలి.
అదెంత పని! తప్పకుండా!
ప్రదక్షిణం అంతసేపూ నువ్వు ఎలాగూ భగవన్నామం ఆపకుండా చేస్తావనుకో!
2


ఒక్క చుక్క కూడా క్రింద పడనీకు నారదా!
అమ్మో! ఈ నూనె ఒలుకుతున్నట్టు ఉంది. నేను ఇంకా మెల్లగా నడవాలి.
3


ఎంత మెల్లగా నడిచినా ఈ నూనె ఒలుకుతుందేమో అని భయమేస్తోంది. అసలే ఇది ఒలికితే అరిష్టం అని తాతగారు మరీ మరీ హెచ్చరించారు.
4


హమ్మయ్య! మొత్తానికి విజయవంతంగా ప్రదక్షిణం పూర్తి చేశాను.
5


ప్రభూ! తమ ఆజ్ఞ ప్రకారమే ఒక్క చుక్క నూనె కూడా ఒలకకుండా ప్రదక్షిణం పూర్తి చేశాను. ఇక ద్వారకకు వచ్చిన ఆపద తొలగినట్లే.
చాలా సంతోషం నారదా! ఈ ప్రదక్షిణం అంతసేపూ నువ్వు ఆపకుండా భగవన్నామం చేశావు కదూ?
6


అయ్యో! నాకంత సమయం ఎక్కడిది స్వామీ! ప్రదక్షిణం చేస్తున్నంత సేపూ ఎక్కడ ఒక చుక్క నూనె క్రింద పడుతుందో, ద్వారకకు మళ్ళీ అరిష్టం వస్తుందో అని నా మనసంతా ఆ నూనె గిన్నె మీదనే పెట్టవలసి వచ్చింది. ఇక భగవన్నామం ఎక్కడ చేసేది?
7
చూశావా నారదా! ఇంత చిన్న పని చెయ్యవలసి వస్తేనే నువ్వు భగవన్నామాన్ని మర్చిపోయావే! మరి సంసారంలో అనేక బాధ్యతలు మోస్తూ కూడా ప్రతి పని చేసేముందు నామస్మరణ చేసుకుంటున్న ఆ సుబ్బయ్య నీకన్నా గొప్ప భక్తుడు కాదంటావా?
నా కళ్ళు తెరిపించారు ప్రభూ! నాబోటి సన్యాసి కన్నా, సంసార బాధ్యతలలో తలమునకలై కూడా భగవంతుని మరువనివాడే మహా భక్తుడు!
8

# ఖాతా

సేకరణ - ఎన్. కాళీప్రసాద్

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. రోగి చాలా ఆందోళనకరమైన పరిస్థితిలో ఉన్నాడు. అక్కడి వైద్యుడు, ఆ ఆసుపత్రి యజమాని కూడా రోగిని చూసిన వెంటనే ఐసియులోకి తీసుకెళ్ళాడు. రెండు-మూడు గంటల ఆపరేషన్ తర్వాత, డాక్టర్ బయటకు వచ్చి, “ఈ వ్యక్తికి ఇక్కడ ఎలాంటి ఇబ్బంది లేదా అసౌకర్యం కలగకుండా జాగ్రత్తగా చూసుకోండి” అని తన సిబ్బందికి చెప్పాడు.

ఆ వ్యక్తి నుండి చికిత్స కోసం, మందుల కోసం డబ్బు తీసుకోవద్దని కూడా వారికి సూచించాడు. ఆ రోగి దాదాపు 15 రోజుల పాటు ఆసుపత్రిలోనే ఉన్నాడు. అతను బాగా కోలుకుని, ఆసుపత్రి నుండి బయటకి వెళ్ళాలనుకున్నప్పుడు, డాక్టర్ (ఆసుపత్రి యజమాని) అతని తుది నివేదికలను సమీక్ష కోసం తీసుకుంటూ, ఆ రోగికి సంబంధించిన సుమారు 2.5 లక్షల రూపాయల బిల్లు కూడా తీసుకున్నాడు.

డాక్టర్ తన అకౌంట్ మేనేజర్‌ని పిలిచి, “ఈ వ్యక్తి నుండి ఒక్క పైసా కూడా తీసుకోవద్దు. ఒక పని చేయండి, ఆ పేషెంట్‌ని నా వద్దకు పంపించండి” అన్నాడు. ఆ వ్యక్తిని వీల్‌చైర్‌లో డాక్టర్ క్యాబిన్‌కు తీసుకువచ్చారు. డాక్టర్ ఆ వ్యక్తిని చూసి ఇలా అడిగాడు, “సోదరా! మీరు నన్ను గుర్తించారా?” ఆ పేషెంట్, “మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుగా అనిపిస్తోంది కానీ, సరిగా గుర్తు రావడం లేదు!” అన్నాడు.

అప్పుడు డాక్టర్ ఇలా చెప్పసాగారు ‘మీకు గుర్తుందా, దాదాపు నాలుగు సంవత్సరాల క్రితం, ఒక సాయంత్రపు సమయంలో నగర శివార్లలో ఒక అడవిలో ఒక కారును మరమ్మత్తు చేశారు. ఆ రోజు నేను మా కుటుంబంతో కలిసి విహారయాత్రకు వెళ్ళి తిరిగి వస్తుండగా, కారులో నుండి అకస్మాత్తుగా పొగ రావడం మొదలై, ఉన్నట్టుండి ఆగిపోయింది. మేము కారును ఓ పక్కన ఆపి, దాన్ని మళ్ళీ స్టార్ట్ చేయడానికి ప్రయత్నించాం, కానీ కారు స్టార్ట్ అవలేదు, అప్పటికే కొద్దిగా చీకటి పడుతోంది, చుట్టూ అంతా నిర్జీవమైన అడవి. మా కుటుంబసభ్యుల ప్రతి ఒక్కరి ముఖాల్లో ఆందోళన, భయం తాలూకు ఛాయలు కనపడుతూ ఉన్నాయి.

అందరం భగవంతుడిని ప్రార్థిస్తూ, సహాయం దొరుకుంతుందేమో అన్న ఆశలో ఉన్నాం. కొద్దిసేపటికే ఓ అద్భుతం జరిగింది. మీరు బైక్‌పై రావడం చూశాం. ఆశ నిండిన కళ్లతో మిమ్మల్ని ఆపడానికి మేము చేతులు ఊపాం. మీరు బైక్ ఆపి, విషయం తెలుసుకున్న తర్వాత కారు బానెట్ తెరిచి, పరిశీలించి మరమ్మత్తు చేసిన కొద్ది క్షణాల్లోనే కారు స్టార్ట్ అయ్యింది. మేమంతా చాలా సంతోషించి, చాలా తేలిక పడ్డాం! మిమ్మల్ని ఆ భగవంతుడే పంపినట్లు మాకు అనిపించింది. ఎందుకంటే, ఆ నిర్జనమైన అడవిలో రాత్రంతా గడపాలన్న ఆలోచనకే మా ఒళ్ళు జలదరించింది.

మీరు ఒక గ్యారేజీని నడుపుతారని ఆ రోజు నాకు చెప్పారు. నేను మీకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఎంత డబ్బు ఉన్నా కూడా అలాంటి కష్ట సమయాల్లో ఎలాంటి సహాయం చేయదని చెప్పాను. అటువంటి క్లిష్ట పరిస్థితిలో మీరు చేసిన సహాయానికి విలువ కట్టలేను, అది అమూల్యమైనది. అయినా కూడా ఎంత ఇవ్వాలి అని నేను మిమ్మల్ని అడిగాను.

- సశేషం

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**జులై 2022**

10 ఆది - తొలి ఏకాదశి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

13 బుధ - ఆషాఢ పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

23 శని - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

**ఆగస్ట్ 2022**

12 శుక్ర - శ్రావణ పూర్ణిమ, రాఖీ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

19 శుక్ర - శ్రీకృష్ణాష్టమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

21 ఆది - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

31 బుధ - శ్రీవినాయక చవితి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి)

- రేఖ

ఈ హిందూ సంస్కృతిలో కైవల్యోపనిషత్తు ఒక అందమైన ఆభరణం అయితే ఈ 21వ మంత్రం ఆ ఆభరణం యొక్క సౌందర్యాన్ని వృద్ధి పరచడానికి అమర్చబడిన పతకం అని చెబుతారు పెద్దలు. మనం ఉపనిషత్ ఉపాసన చేస్తున్నాము. అంటే సౌందర్యోపాసన చేస్తున్నాము. మనలో వున్న ఆత్మసౌందర్యోపాసన చేస్తున్నాము, బాహ్య సౌందర్యము కాదు. అది మార్పుతో కూడినది. ఆత్మ సౌందర్యమే సౌందర్యము అని శ్రీగురుదేవులు చెబుతూ వుండేవారు. అని అంటూ మాతాజీ 22వ మంత్రాన్ని వివరించారు.

అనేక వేదముల చేత ఎన్ని వున్నా కూడా 'నేనే' తెలుసుకోదగినవాడను. వేదాంతములైన ఉపనిషత్తులను తెలియజేసే వాడను నేనే. వేదములన్నీ తెలిసినవాడను నేనే. నాకు పుణ్య పాపములు లేవు. దేహేంద్రియాది భావనలు లేవు. సర్వానికీ శక్తినిచ్చేది నేనే (ఆ పరమాత్మయే) అన్నప్పుడు ఇక్కడ జన్మ, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి గురించిగానీ, వేరే వేరే వాటిని గురించిగానీ ఆలోచించగలమా? ఈ సృష్టిలో ప్రతిదీ ప్రకాశింపజేసే ఆత్మ స్వరూపం సర్వత్రా నిండి వున్నప్పుడు, ఆ చెట్టు నేనే, ఈ పుట్ట నేనే అని వేరువేరుగా చెప్పనక్కర్లేదు.

పుణ్య పాపములు లేవు నాకు. మనస్సు లేదు కనుక మనం బాధ పడవలసిన పని లేదు. దృష్టి అంతా ఆత్మ వస్తువు నందు వుంచి అనేక రకాలైన పనులు చేయవచ్చు మనం. నడిచి వెడుతూ వుంటాం పొరపాటున చీమ మీద కాలుపడి అది చచ్చిపోతే అప్పుడు పాపం అంటదు. కాని తెలిసి చేస్తే అంటవచ్చు. కానీ, ఈ రెంటికీ కూడా అతీతంగా వుంటుంది ఆ 'నేను'. మానవుని ఆలోచనల వల్ల కొన్ని క్రియలు చేయడం వల్ల అతని మనస్సులో ముద్రలు వేయబడతాయి. అవే పాపపుణ్యాలు. అవి వాసనా రూపంలో వుంటాయి. ఈ వాసనలు ఒక వ్యక్తిలోని ఆలోచనలను, మనోవృత్తులను శాసించి, బంధిస్తాయి. వీటిని అధిగమిస్తే అవి పైకి ఎగిరిపోతాయి. వాసనలకు ఆవలనున్నది నాశనము లేనిది (అక్షరము), అద్వయము ఆ పరబ్రహ్మ ఒక్కటే అని తెలుసుకుంటాడు.

ఈ సందర్భంగా శ్రీ మాతాజీ ఒక కీర్తన ఆలపిస్తూ ..........

**బహ్మాజ్ఞానికి ఒకదానిపైనే ఆశ, బ్రహ్మాజ్ఞానికి లేదు వినాశము**

**1. బ్రహ్మాజ్ఞాని వినయ పూర్ణుడు, బ్రహ్మాజ్ఞాని పరోపకారి, సంతోషి ।బ్రహ్మా**

**2. బ్రహ్మాజ్ఞాని చేయునదంతయూ మంచియే బ్రహ్మాజ్ఞానిది సుఫల ఫలము**

**బ్రహ్మాజ్ఞాని సదా సదా జాగరూకుడు, బ్రహ్మాజ్ఞాని అహంకార త్యాగి । బ్రహ్మా**

ఈ పాటలో బ్రహ్మాజ్ఞానికి లేదు వినాశము అని చెబుతున్నారు. ఎంతెంతో మంది అవతరిస్తున్నారు, నిష్క్రమిస్తున్నారు. ఆశ్రయించినటువంటి నిజ గురు భక్తుడిని అడిగితే, నా గురుదేవుడు నాలోనే వున్నాడు, నాతోనే వున్నాడు అంటాడు. నా గురుదేవులు లేకపోతే నేను లేను అంటాడు. రాముడు, కృష్ణుడు ఆ యా అవతారాలలో అవతరించి, నిష్క్రమించారు. రామ లేదా కృష్ణ అనుకుంటే చాలు మనస్సు స్పందిస్తోంది. ఆ స్పందనతో వారి సాక్షాత్కారాన్ని అనుభవిస్తోంది. బ్రహ్మతత్వ విషయంలో (నాస్తి అంటే లేదు అని) ప్రాణం లేదు అనటానికి లేదు ఈ మహాతత్వంలో.

బ్రహ్మాజ్ఞానికి ఆశ ఏమిటి? **త్వమేవ తత్, తత్ త్వమేవ**. ఆశ్రయించిన భక్తులు ఈ ప్రపంచంలో సంచరిస్తూ కూడా నేను అనే ఆత్మతత్వ రూపాన్ని తెలుసుకుని, దానియందే రమిస్తున్నారా లేదా అనేదే వారి ఆవేదన. అనుభవించాలన్నదే వారి ఆశ. గురుపాదాన్ని ఆశ్రయించిన మనందరికీ ఒకవేళ ఆ రూపం అరూపమైనా ఆ మూర్తి అమూర్తి అవుతోందే తప్ప అది మనని విడచి వెళ్ళేది కాదు. అది తానే అనే సత్యాన్ని గుర్తింపజేస్తోంది కైవల్యోపనిషత్. ఆ 'నేను' అనంత శక్తి. సాధకుడు పరమాత్మను చేరడానికి, ఆత్మానుభూతిని పొందడానికి వేదములోని కర్మకాండ సహాయపడుతుంది. ఆ పరమాత్మ తత్వాన్ని చేరే విధానమును పరమాత్మ యొక్క స్వరూప స్వభావాలను ధ్యానయోగం ద్వారా ఆ తత్వాన్ని తెలుసుకునే విధానమును ఉపనిషత్తులు తెలియజేస్తున్నాయి.

- సశేషం

# కర్మభూమి-భోగభూమి

- పాలూరి కాళీప్రసాద్

మన భారతదేశం కర్మభూమి అని, దేవతలు సైతం మోక్షం పొందాలంటే ఇక్కడ పుట్టాలని తపిస్తూ ఉంటారని గురుదేవులు శ్రీ బాబూజీ మహరాజ్ వారు తరచుగా చెబుతూ ఉండేవారు. అలాగే భగవద్గీతలో ఎన్ని అక్షరాలు ఉన్నాయో అంతమంది మహాత్ములు ఈ పవిత్ర భూమిలో అవతరించారని, అందుకే దీనిని రత్నగర్భ అంటారని కూడా చెప్పేవారు. అలాగే అమెరికా భోగభూమి అని, అక్కడకు అందరూ భోగాలు అనుభవించడానికి వెళతారని మనం మామూలుగా అనుకుంటూ ఉంటాం. అయితే శ్రీగురుదేవులు ఒకసారి అమెరికాలో ఉన్నప్పుడు ఇండియాలోని భక్తుడు ఫోన్ చేసి "మీరు అక్కడా, మేము అందరం ఇక్కడా ఉండిపోయామని" బాధ పడితే అప్పుడు శ్రీగురుదేవులు "అక్కడ ఇండియా ఇక్కడ అమెరికా తీసివేస్తే ఉన్నదంతా ఒక్కటే" అని బదులిచ్చారు.

నిజానికి గురుశక్తి సర్వవ్యాపకమైనది, దేశ కాలాలకు అతీతమైనది. గురుదేవులు ఎప్పుడు ఎక్కడ ఎవరితో ఏ కార్యం చేయిస్తారో, ఎవరిని ఎలా రక్షిస్తారో ఎవరూ చెప్పలేరు. నేను కాలేజీలో ఉండగానే శ్రీగురు సహస్రనామావళికి అర్థాలు వ్రాయటం మొదలుపెట్టాను. కానీ అది చాలా మెల్లగా సాగేది. ఆ తరువాత కొన్ని సంవత్సరాలకు ఉద్యోగరీత్యా అమెరికా వెళ్ళడం జరిగింది. మొదట్లో 'ఇది భోగభూమి కదా! ఇక్కడ ఎందుకు వ్రాయటం? త్వరలోనే మళ్ళీ మన పవిత్ర భారతదేశానికి వెళ్లిపోతాం కదా. అక్కడ వ్రాయవచ్చులే!' అనుకొని కొన్నాళ్ళు తాత్సారం చేశాను. అయితే ఒకసారి శ్రీమాతాజీ అమెరికా వచ్చినప్పుడు అప్పటివరకూ వ్రాసినవి చూపిస్తే 'బాగుంది, త్వరగా పూర్తి చేయ'మని ప్రోత్సహించారు. అలాగే మరి కొన్ని సంవత్సరాలు అక్కడే ఉండమని కూడా సూచించారు. దానితో ఈ దేశకాల విషయాలు పట్టించుకోకుండా మళ్ళీ వ్రాయటం ప్రారంభించాను. చాలావరకు ఆఫీసుకి వెళ్ళివచ్చే సమయంలో బస్సులోనే వ్రాయటం జరిగింది. 'నువ్వు ఏ క్షేత్రంలో ఉన్నావన్నది ముఖ్యం కాదు, నీ హృదయ క్షేత్రంలో ఏమున్నదనేదే ముఖ్యం' అని శ్రీగురుదేవులు నిరూపించిన దివ్యలీల!

అలాగే శ్రీగురుదేవులు దేశకాలాతీతులు అనడానికి నిదర్శనంగా అమెరికాలో ఉన్నన్నాళ్ళూ మాకు ఎప్పుడు ఏ చిన్న కష్టం వచ్చినా, మనసుకు అశాంతి కలిగినా వెంటనే శ్రీమాతాజీ వారినుండి వీడియో కాల్ వచ్చేది.

అమ్మను దర్శించుకొని, సంభాషించగానే మనశ్శాంతి, బాధానివారణ జరిగిపోయేవి. ఒకసారి మా ఇంటిముందు నుంచి కారు తీస్తూ ఉండగా వేరే కారు నడుపుతున్న యువతి వేగంగా కారు వెనుకకు నడిపి నా కారును గుద్దింది. తప్పు ఆమెదే అయినా, తొందరగా రిపేరు అవ్వాలని, ఇన్స్యూరెన్సు కంపెనీ వారి సలహాపై వెయ్యి డాలర్లు నా జేబులోనుండి కట్టి రిపేరు చేయించుకున్నాను. అయితే నెలలు గడుస్తున్నా మళ్ళీ ఆ డబ్బులు వెనక్కి ఇవ్వడంపై ఇన్స్యూరెన్సు కంపెనీ నుండి ఎటువంటి సమాచారం లేదు. ఒకరోజు ఆఫీసులో ఖాళీ దొరికినప్పుడు ఇన్స్యూరెన్సు వారికి ఫోను చేస్తే అవతలి పార్టీ వాళ్ళ ఇన్స్యూరెన్సు కంపెనీ వాళ్ళు సరిగా స్పందించడం లేదనీ, తాము కోర్టుకు వెళ్ళి తేల్చుకుంటామని, తమకు ఎప్పుడు డబ్బులు వస్తే అప్పుడే నాకు ఇస్తామనీ, పూర్తిగా వస్తాయని నమ్మకం లేదనీ చెప్పారు.

వెయ్యి డాలర్లు అంటే చిన్న మొత్తం కాదు. శ్రీగురుదేవుల పాదుకల వద్ద నమస్కరించి వేడుకుందామంటే నేను ఆఫీసులో వున్నాను. అందుకని మనస్సులోనే శ్రీగురుదేవులను ప్రార్థించుకున్నాను. సరిగ్గా అరగంటలో ఇన్స్యూరెన్సు కంపెనీ నుండి ఫోను చేసి, తమకు రావలసిన మొత్తం వచ్చేసిందని, ఇప్పుడే మీకు వెయ్యి డాలర్ల చెక్కు పంపిస్తున్నామని చెప్పారు. గురుశక్తి యొక్క సర్వ వ్యాపకత్వానికి ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. మనం కేవలం భోగభూమిగా భావించే అమెరికాలో ఉన్న 11-12 సంవత్సరాలలో వారివద్ద ఎన్నో మంచి విషయాలు, అలవాట్లు నేర్చుకోవటం జరిగింది. ముఖ్యంగా జాతి, నీతి, కుల, మత భేదాలు పాటించకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించడం అందరూ నేర్చుకోదగిన మంచి లక్షణం.

మేము మొదటి ఆరు నెలలు ఉన్న ప్రదేశంలో ఒకప్పుడు (1975-1993 మధ్య కాలంలో) ఎవరైనా బొట్టు పెట్టుకున్న వ్యక్తి కనిపిస్తే వారిమీద దాడులు జరిగేవి. అలాంటిది మేము ఉన్నన్నాళ్ళూ ప్రతిరోజూ బొట్టు పెట్టుకునే బయట తిరగటం, ఆఫీసుకు వెళ్ళటం చేసేవాడిని. మొదట్లో మొహమాటానికి చాలా చిన్న బొట్టు పెట్టుకునేవాడిని. ఒకసారి శ్రీమాతాజీవారు అమెరికా వచ్చినప్పుడు నేను ఆఫీసుకి బయలుదేరుతూ ఉంటే, “ఒరే! నువ్వు బొట్టు పెట్టుకోలేదు నాన్నా!” అన్నారు. “నేను పెట్టుకున్నానమ్మా” అన్నా కూడా మళ్ళీ మళ్ళీ “లేదు నాన్నా! నువ్వు పెట్టుకోలేదు” అన్నారు. విషయం అర్థమై అప్పటినుండి తగినంత పెద్ద బొట్టు పెట్టుకోవటం అలవాటు చేసుకున్నాను.

ఇక అమెరికా వాసులనుండి నేర్చుకోవలసిన రెండవ గొప్ప విషయం 'ఇది పెద్ద పని, ఇది చిన్న పని' అనే భేదాలు లేకుండా ప్రతి పని గౌరవప్రదమైనదిగానే చూడటం. ఈ రెండు మంచి గుణాలు మనమందరం అలవాటు చేసుకోగలిగితే అటు సోషలిష్టులైనా, ఇటు ఆధ్యాత్మిక వాదులైనా ప్రవచించే సమ సమాజ స్థాపన జరుగుతుంది. అప్పుడు అది కర్మభూమి అయినా భోగభూమి అయినా దానిని మనం యోగభూమిగానే పరిగణించగలుగుతాం.

**సమత్వం యోగ ఉచ్యతే**

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**జులై 2022**

10 ఆది - తొలి ఏకాదశి - ఏకాహం సంకీర్తన, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

13 బుధ - ఆషాఢ పూర్ణిమ - గురుపూర్ణిమ, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

17 ఆది - దక్షిణాయన పుణ్యకాల ప్రారంభము

23 శని - శ్రీ గురుదశమి, మాసశివరాత్రి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

26 మంగళ - మాస శివరాత్రి

28 గురు - అమావాస్య

31 ఆది - శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

**ఆగస్ట్ 2022**

5 శుక్ర - వరలక్ష్మీ వ్రతం

12 శుక్ర-శ్రావణ పూర్ణిమ - రాఖీ - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

19 శుక్ర - శ్రీకృష్ణాష్టమి - కలశ స్థాపన, శ్రీరాధాకృష్ణ సహస్రనామార్చన భక్తసమారాధన, రాత్రి 7గం. శ్రీసద్గురు పాదపూజ

20 శని - ఉదయం 11గం.లకు సామూహిక శ్రీరాధాకృష్ణ సహస్ర నామార్చన, భక్త సమారాధన.

21 ఆది - శ్రీగురుదశమి - ఏకాహం, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

25 గురు - మాస శివరాత్రి

27 శని - అమావాస్య

31 బుధ - వినాయకచవితి - తె.జా 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, ఉదయం 11గం. సామూహిక వినాయకవ్రత పూజలు, భక్తసమారాధన.

# శ్రీ మాతా కళావతి దేవి

సేకరణ - మురళి

(గత సంచిక తరువాయి)

ఇంకా ఉన్నత ఆధ్యాత్మిక స్థితిని అందుకోవడం కోసం ఆరునెలలు పాటు ఏకాంతంగా ధ్యాన సాధన చేయమని కళావతీదేవిని ఆదేశించారు గురుదేవులు. ఆమె గురుదేవుల ఆజ్ఞను శిరసావహించి ఆరునెలల పాటు తనకు మాత్రమే సరిపోయే ఒక చిన్న గదిలో వుంటూ, రోజుకు ఒక కప్పు పాలన్నము, రెండు కప్పుల నీరుతో సరిపెట్టుకుంటూ రోజుకు 18 గంటలు సాధన చేసేవారు. గడువు పూర్తి అయిన తరువాత ఆవె పొందిన భగవదనుభూతితో అత్యంత తేజోవంతవైన ముఖవర్చస్సుతో ఆశ్రమంలోకి అడుగుపెట్టారు. గురుదేవులు ముందుగానే తెలియజేసిన విధంగానే మహాసమాధి చెందారు. 'ధ్యాన సాధన పూర్తి అయిన తరువాత సంచారం చేస్తూ 12 సంవత్సరాలు నామ సంకీర్తన ప్రచారం చెయ్యి. మానవ రూపంలో వున్న భగవంతుని సేవలో ఆనందం పొందండి. నేను ఎల్లవేళలా మీ వెన్నంటే వుండి రక్షిస్తూనే వుంటాను. భయపడద్దు. పన్నెండు సంవత్సరాలు పూర్తి అయిన తరువాత బెల్గాం లోని అంగోల్ వద్ద స్థిరపడి అక్కడ వెనుకబడిన సమాజం అభ్యున్నతి కొరకు కృషి చేయండి. వారిలో భగవంతుని యెడల భక్తి, ప్రేమలను కలిగించండి. దీనితో అక్కడ నివశిస్తున్న నా భక్తునికి నేను ఇచ్చిన వాగ్దానం నెరవేరుతుంది' అని గురుదేవులు కళావతీదేవిని ముందుగానే ఆదేశించి ఆశీర్వదించారు.

గురుదేవుల ఆజ్ఞానుసారం కళావతీదేవి సంచారం చేస్తూ నామసంకీర్తన ప్రచారంచేయసాగారు. ప్రధానంగా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలలో ఎక్కువగా ప్రచారం చేశారు. 1938లో ముంబాయిలోని శాంటాక్రూజ్‌లో సుమారు ఆరు నెలలపాటు వుండి పోయారు. ఈ సమయంలో గురుదేవుల పుణ్యతిథి కార్యక్రమాలలో భాగంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

శ్రీమతి శివరావు ఎప్పటి నుంచో మెదడు వ్యాధితో బాధ పడుతున్నారు. ఎన్ని వైద్యాలకూ లొంగలేదు. ఆవె ఈ కార్యక్రమాలన్నింటిలో చివరి వరకూ పాల్గొన్నారు. కార్యక్రమాలు పూర్తి అయ్యేసరికి ఆమె ఆరోగ్యం చాలా బాగుపడింది. ఆమె కృతజ్ఞతతో 2000 రూపాయిలు కళావతీదేవికి సమర్పించబోయారు. మాతా కళావతీదేవి

ఎప్పటిలాగే సున్నితంగా తిరస్కరించారు. మాతాజీ కార్యక్రమాలు నిర్వహించిన చోటల్లా అక్కడి వారు ధనం, బంగారం బహుమతులు ఇవ్వబోయారు కానీ ఆమె ఎక్కడా కూడా వాటిని స్వీకరించలేదు. మాతాజీ (కళావతీదేవి) నామ సంకీర్తన ప్రచారం 12సంవత్సరాలు పూర్తిచేసి, 1942లో శ్రీరామనవమి నాటికి బెల్గాం చేరుకున్నారు. ఒకరోజు రాత్రి శివరావుగారికి బెల్గాంలోని అంగోల్ ప్రాంతంలో వున్న వారి స్థలాన్ని శ్రీ మాతాజీ వారికి సమర్పించవలసినదిగా దివ్యస్వప్నం కలిగింది. వారు మాతాజీని వెతుక్కుంటూ బెల్గాం వచ్చి, ఆమెకు తన స్వప్న వృత్తాంతం తెలియజేసి, తాను ఇచ్చే స్థలం స్వీకరించమని ప్రార్థించారు. శ్రీ మాతాజీకి కూడా ఇదివరకే గురుదేవుల ద్వారా ఇటువంటి స్ఫురణ కలగటంతో ఆ స్థలాన్ని ఆమె స్వీకరించారు.

శ్రీ శివరావుగారు ఇచ్చిన స్థలంలో ఆశ్రమం నిర్మించి 'శ్రీహరి మందిరము' అని పేరు పెట్టారు. అనేకమంది సాధుమహాత్ముల బోధలు కలిగివున్న కీర్తనలను సేకరించి, సంకలనం చేసి, భక్తులందరికీ సంకీర్తన చేయడం నేర్పించారు. సంకీర్తన చేసేటప్పుడు శ్రద్ధతో వాటి అర్థం తెలుసుకుని, ఆచరణలో పెట్టమని, లేకపోతే సాధనలో ఏమాత్రం పురోగతి సాధించలేమని బోధించేవారు. ఈ సంకీర్తనలు శాంతి, సంతృప్తి మరియు ఆనందాలను కలుగజేయటంతో భక్తులు ఇది భగవంతుని చేరుకునే మార్గమని గ్రహించారు. అంగోల్ ప్రాంతంలో బోహారీలు అనే వెనుకబడిన జాతుల వారు ఎక్కువగా నివశిస్తూ వుండేవారు. వారు ఆచార వ్యవహారాలు, జీవన శైలిలో చాలా వెనుకబడి వుండేవారు. కాలానుగుణంగా మారటానికి కూడా విముఖత చూపించేవారు. శ్రీహరిమందిరం స్థాపించిన తరువాత శ్రీమాతాజీ వారందరినీ చేరదీసి, భక్తిమార్గాన్ని బోధించి, నిత్యమూ జరిగే ప్రార్థనలలో పాల్గొనవలసినదిగా ఉత్సాహపరిచారు. వారిలో పూర్తి మార్పు వచ్చి, భగవంతునిలో విశ్వాసం పెంపొందించుకుని త్రికాలములలో ప్రార్థనలో పాల్గొనడం, శరీర శుభ్రత పాటించడం మొదలుపెట్టారు. చివరి ప్రార్థన సమావేశం రాత్రి 9 - 10 గం. వరకు జరగటం వలన రాత్రిపూట వారికి మద్యం సేవించే అలవాటు కూడా తప్పిపోయింది.

- సశేషం

# **వివేక చూడామణి** సేకరణ - రమణ ప్రసాద్

**జన్మవృద్ధిపరిణత్యపక్షయ**

**వ్యాధినాశన విహీనమవ్యయమ్,**

**విశ్వసృష్ట్యవనఘాత కారణం**

**బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని ॥** 259

జన్మ, వృద్ధి, పరిణతి, అపక్షయము, వ్యాధి, నాశము అను షడ్వికారములు లేనిది, విశ్వము యొక్క సృష్టి, స్థితి, లయములకు కారణమైనది అగు ఆ బ్రహ్మము నీవే. “నేనే పరబ్రహ్మము” అని సదా భావింపుము.

**అస్త భేద మనసాస్త లక్షణం**

**నిస్తరఙ్గ జలరాశి నిశ్చలమ్,**

**నిత్యముక్తమవిభక్తమూర్తి యత్**

**బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని ॥** 260

ఆ పరబ్రహ్మము భేద శూన్యమై, తరంగములు లేని సముద్రము వలె నిశ్చలమై, సర్వదా బంధ రహితమై, విభజింపరానిదై అఖండ స్వరూపము అయిన ఆ బ్రహ్మమే నీవు. “నేనే పరబ్రహ్మము” అని సదా భావింపుము.

**ఏకమేవ సదనేక కారణం**

**కారణాంతరనిరాస కారణమ్,**

**కార్య కారణవిలక్షణం స్వయం**

**బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని ॥** 261

ఆ పరబ్రహ్మము, సజాతీయ విజాతీయశూన్యమగు ఏక వస్తువు, త్రికాలాబాధ్యము, భూత భౌతిక స్థూల సూక్ష్మ శరీరాది ద్వందములకు అతీతమై, కారణ రహితమగు అనాది వస్తువు. కార్య కారణ విలక్షణము, స్వయంప్రకాశమైనది అయిన ఆ బ్రహ్మము నీవే. “నేనే పరబ్రహ్మము” అని సదా భావింపుము.

**నిర్వికల్పమనల్పమక్షరం**

**యత్ క్షరాక్షరవిలక్షణం పరమ్,**

**నిత్యమవ్యయ సుఖం నిరంజనం**

**బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని॥** 262

ఆ పరబ్రహ్మము కల్పనా రహితము, మహత్తరము, నాశ రహితము, క్షరాక్షరముల(శరీరము, జీవుడు)కంటె భిన్నమైనది, నిత్యము, అవ్యయము, ఆనంద రూపము, నిష్కళంకమై ఒప్పు ఆ బ్రహ్మము నీవే. "నేనే పరబ్రహ్మము" అని సదా భావింపుము.

**యద్విభాతి సదనేకధా భ్రమా**

**న్నామరూపగుణ విక్రియాత్మనా,**

**హేమవత్స్వయమవిక్రియం సదా**

**బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని ॥** 263

ఆ పరబ్రహ్మము, ఆభరణములనేకములైనను స్వర్ణము ఏకమైనట్లును, నామ రూప గుణముల వికారమొంది అనేక రూపములుగా ప్రతీతమయినను, వాస్తవముగా సర్వ వికార శూన్యమగు ఆ బ్రహ్మమువే నీవు. "నేనే పరబ్రహ్మము" అని సదా భావింపుము.

- సశేషం

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***జులై 2022 :*** AS 3728, 3908, 6405, 7490-7495, 7511, 7909, 8765-8767, 8769-8772, 8774, 8776, 8777, 8779-8784, 8786-8819, LM 4339

***ఆగస్ట్ 2022 :*** AS 7516, 7563-7574, 8033, 8341, 8820, 8821, 8822, 8826, 8829, 8831, 8833, 8834, 8836, 8839, 8840, 8842-8845, 8848-8854, 8856-8859. LM 4343, 4345, 4349, 4352.

# అక్షయ తృతీయ

సేకరణ - బొంబాయి కృష్ణారావు

వైశాఖ శుద్ధ తదియనే అక్షయ తృతీయగా జరుపుకుంటారు. ఈ రోజునే సింహాచల వరాహ నరసింహ స్వామివారి చందనోత్సవం కూడా జరుగుతుంది. స్వామి వారు భక్తులకు నిజరూప దర్శనం ఇస్తారు. అక్షయ తృతీయ ప్రాముఖ్యతలు చాలా వున్నాయి. అందులో కొన్ని చూద్దాం

1. పరశురాముని జన్మదినం.
2. పవిత్ర గంగా నది భూమిని తాకిన పర్వదినం.
3. త్రేతాయుగం మొదలైన దినం.
4. శ్రీకృష్ణుడు తన బాల్యమిత్రుడైన కుచేలుని కలుసుకొన్న దినం.
5. వ్యాస మహర్షి మహా భారతమును, వినాయకుని సహాయముతో వ్రాయడం మొదలుపెట్టిన దినం.
6. సూర్య భగవానుడు అజ్ఞాతవాసములో వున్న పాండవులకు “అక్షయ పాత్ర” ఇచ్చిన దినం.
7. శివుని ప్రార్థించి కుబేరుడు శ్రీమహాలక్ష్మితో సమస్త సంపదలకు సంరక్షకునిగా నియమింపబడిన దినం.
8. ఆదిశంకరులు కనకధారాస్తవమును చెప్పిన దినం.
9. అన్నపూర్ణా దేవి తన అవతారాన్ని స్వీకరించిన దినం.
10. ద్రౌపదిని శ్రీకృష్ణుడు దుశ్శాసనుని బారినుండి కాపాడిన దినం.

అక్షయ తృతీయ నాడు మనం చేపట్టిన ఏ కార్య ఫలమైనా (అది పుణ్యం కావచ్చు , లేదా పాపం కావచ్చు) అక్షయంగా, నిరంతరం జన్మలతో సంబంధం లేకుండా మన వెంట వస్తూనే ఉంటుంది. పుణ్య కర్మలన్నీ విహితమైనవే. అందునా ఆ రోజు ఓ కొత్త కుండలో గానీ, కూజాలో గానీ, మంచినీరు పోసి, దాహార్తులకు శ్రద్ధతో సమర్పిస్తే ఎన్ని జన్మలలోనూ మన జీవుడికి దాహంతో గొంతు ఎండి పోయే పరిస్థితి రాదు. అతిథులకు, అభ్యాగతులకు పెరుగన్నంతో కూడిన భోజనం సమర్పిస్తే, ఏ రోజూ ఆకలితో మనం అలమటించ వలసిన రోజు రాదు. వస్త్రదానం వల్ల తదనుగుణ ఫలితం లభిస్తుంది. అర్హులకు స్వయంపాకం, దక్షిణ, తాంబూలాదులు సమర్పించుకుంటే, మన ఉత్తర జన్మలలో, వాటికి లోటు రాదు. గొడుగులు, చెప్పులు, విసన కర్రల వంటివి దానం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఆ రోజు నిషిద్ధ కర్మల జోలికి వెళ్ళక పోవడం ఎంతో శ్రేయస్కరం.

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

ఆ తాటక ఈ రెండు నగరాల్లో సంచరిస్తుంది, ఆమె నరమాంస భక్షణకి అలవాటుపడింది, అందుకే ఈ నగరాలలోని ప్రజలు ఊరు వదిలి వెళ్ళిపోయారు. కాబట్టి రామా! నీవు ఇప్పుడు ఆ తాటకని సంహరించాలి. నువ్వు చేసే పని దోషమే అయినా, ప్రజాకంటకులైన వాళ్ళని రాజు సంహరించి తీరాలి. పూర్వకాలంలో మందర అనేటువంటి ఒక స్త్రీ భూమిని సంహరించడానికి ప్రయత్నిస్తే ఆమెని సంహరించారు, అలాగే భృగు మహర్షి భార్య ఇంద్రుడిని సంహరించడం కోసం తపస్సు ప్రారంభిస్తే శ్రీమహా విష్ణువు ఆమెని సంహరించారు. ఈమెను వధించిన, స్త్రీ హత్యా పాపము నిన్నంటదు. కావున సందేహమువీడి నువ్వు ఈ తాటకని సంహరించు" అని విశ్వామిత్రుడు అన్నాడు. రాముడు తాటకను సంహరించిన తీరును వాల్మీకి మహర్షి ఈ విధంగా వర్ణించారు.

అప్పుడు రాముడు.......

**పితుర్ వచన నిర్దేశాత్ పితుర్ వచన గౌరవాత్ ।**

**వచనం కౌశికస్య ఇతి కర్తవ్యం అవిశ్కయా ॥**

**గో బ్రాహ్మణ హితార్థాయ దేశస్య చ హితాయ చ ।**

**తవ చైవ అప్రమేయస్య వచనం కర్తుం ఉద్యతః ॥**

"మా తండ్రిగారు మీరు ఏది చెప్తే అది చెయ్యమన్నారు, గురువుగారైన మీరు చెప్పారు కనుక లోకాన్ని రక్షించడం కోసం, బ్రాహ్మణులను, గోవులను, ఇక్కడ ఉంటున్న అన్ని ప్రాణులను కాపాడడం కోసం సుక్షత్రియుడనైన నేను తాటకని తప్పక సంహరిస్తాను" అని రాముడు తన ధనుస్సు తీసుకొని ధనుష్టంకారం చేశాడు, ఆ ధ్వని వినిన తాటకి అది ఎటువైపు నుంచి వచ్చిందో అటు వైపు బయలుదేరి, రామలక్ష్మణులున్న ప్రదేశానికి వచ్చింది. ఆమె, ముందు బ్రహ్మర్షి అయిన విశ్వామిత్రుడి మీదకి దూకింది. అప్పుడాయన ఒక హుంకారం చేసేసరికి అది స్తంభించిపోయి ఉన్నచోటనే నిలబడిపోయింది, వెంటనే తన మాయతో రాళ్ళ వర్షం కురిపించింది, ఆ తాటకి రేపిన ధూళి అందరి కళ్ళల్లో పడింది. అప్పుడు విశ్వామిత్రుడు రాముడితో "ఇంక ఉపేక్షించి లాభం లేదు, తొందరగా ఆమెని సంహరించు" అన్నాడు. "ఎంతైనా ఆడది

కదా, ముందు దీని గమన శక్తిని కొట్టేద్దాము, అప్పుడన్నా మారుతుందేమో చూద్దా" మని రాముడు ఆమె కాళ్ళు, చేతులు, లక్ష్మణుడు ముక్కు, చెవులు నరికారు. అప్పుడు ఆ తాటక మాయారూపం పొంది మాయమైపోయింది. అదృశ్యమైన ఆ తాటక భారీ శరీరంతో రాముడి మీద పడబోతుంటే, రాముడు ఒక బాణం ప్రయోగించి ఆ తాటకని సంహరించగా, దాని రక్తం ఏరులై ప్రవహించింది. పైనుండి దేవతలు చూసి, 'హమ్మయ్య! తాటక సంహరింపబడింది' అని ఆనందించారు.

రాముడు, మొదటి యుద్ధంలో పొందిన విజయమునకు మెచ్చిన దేవతలు, ఆతనిపై పుష్పవర్షం కురిపించారు. "ఇంత ధైర్యం వున్న వాడి దగ్గర అన్ని అస్త్రశస్త్రాలు ఉండాలి, కాబట్టి నీకు తెలిసిన ధనుర్విద్యనంతా రామలక్ష్మణులకి ఉపదేశించు" అన్నారు. విశ్వామిత్రులు కూడ ఆనందపరవశంతో రాముని ఆశీర్వదించి, ఆ యువరాజులు ఇద్దరిని తీసుని బయలుదేరి, ఒక దట్టమైన వనమును చేరుకున్నారు. "ఇదిగో! ఈ వనమందే మా యాగశాల వుంది" అని చెప్పిన విశ్వామిత్రుని, "ఆ యాగశాల విశేషం ఏమిటి?" అని రాముడు ప్రశ్నించాడు.

"విశ్వమంతటినీ పాలించు ఆ మహావిష్ణువు, ఒకమారు ఈ యాగశాలలోనే నూరు ప్రళయకాలములు తపస్సు చేసిన కారణంచేత ఈ వనము పునీతమైంది. ఆ సమయమున గొప్ప పరాక్రమశాలి, అసురకులమునకు చెందినవాడైన బలిచక్రవర్తి భూమండలమును, ఆకాశలోకమును జయించిన పిదప తనకీర్తిని శాశ్వతముగ నిలుపుకోవడానికి నర్మదా నదీతీరమున ఒక గొప్ప యాగము చేయ నిశ్చయించి, యాగం చేయడానికి ముందు తనవద్దనున్న సంపదను బ్రాహ్మణులకు దానం చేయదలచాడు. ఇది గ్రహించిన ఇంద్రుడు, బలి ఇలా చేసినట్లైతే 'మహాబలి ' అవుతాడని తలచి, ఇతర దేవతలతో కలసి, నారాయణుని దగ్గరకు వెళ్ళి, విష్ణువును శరణుకోరి, బలి సంహారము చేయమని అర్థించారు. వారికి అభయమునిచ్చిన మహావిష్ణువు, "బలి నా భక్తుడు, ప్రహ్లాదుని మనుమడు, హిరణ్యకశ్యప సంహార సమయమున నేను ఇకపై ఆ వంశమున జన్మించిన ఏ రాజునూ సంహరించనని ప్రతిజ్ఞ చేసాను. కావున ఆతని దర్పమును మాత్రమే అణచివేయగలనని తెలిపి, బలిని పాతాళమునకు అదమివేసాడు." అని రామలక్ష్మణులకు విశ్వామిత్రుడు తెలియజేశాడు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ కొండ శేషంరాజుగారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి)

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

అంతలో ఆ వీధిగుండా వెడుతున్న ఒక వృద్ధ సాధువు (భగవానుడే ఆ రూపంలో) గుడి అరుగు మీద కూర్చుని దు:ఖపడుతున్న అన్న వద్దకు వచ్చి, అతని ఆవేదనకు కారణం తెలుసుకొని, అతనిని ఊరడిస్తూ యిలా చెప్పాడు "నాయనా! భగవంతుని కృప వలన నాకు భూత భవిష్యద్వర్తమానాలు తెలుస్తాయి. ఇప్పుడు కలిగినదంతా నీ మంచికే. నీవు యీ జన్మలో చేసినదంతా సత్కర్మమే. దాని సత్ఫలితం నీకు



లభించి తీరుతుంది. కాని నీవు పూర్వజన్మలో చేసిన దుష్కర్మ ఫలితంగా యీ సమయంలో నీకు సర్పగండం ఉంది. కాని యిప్పటి నీ సత్కర్మల ఫలితంగా పాము కాటుకు బదులు ముల్లు గుచ్చుకోవటంతో ఆ గండం తప్పింది. నీ తమ్ముడికి పూర్వ పుణ్య ఫలంగా యిప్పుడు ఒక గొప్ప నిధి దొరకవలసి ఉన్నది. కాని యిప్పటి దుష్కర్మల ఫలితంగా అతనికి ఒక బంగారపు ఉంగరం మాత్రమే దొరికింది. భగవానుడు ఇద్దరికీ న్యాయమే చేశాడు. భగవానుడికి చేతకానిది ఒక్కటే - అన్యాయం చేయటం" అని చెప్పి వెళ్ళిపోయాడు.

మీ కుటుంబానికీ ఆ దంపతుల జంటలకూ ముందు ముందు జరుగవలసి ఉన్న ఘోరమైన అరిష్టాలు, యీ రెండు ప్రమాదాలతోనూ కొట్టుకొని పోవాలనే నేను యిద్దరికీ ఒకే ముహూర్తం నిర్ణయించాను. ఎటువంటి అరిష్టమూ ఇకముందు కలుగబోదని, అన్నీ శుభములే జరుగుతాయని నేను హామీ యిస్తున్నాను. దానికి తార్కాణం రెండు పందిళ్ళు విరిగి పడినా, ఎవరికీ ఏ ప్రమాదమూ జరుగక పోవటమే. పందిళ్ళు పడిపోవటమూ అది అపశకునమనుకోవటమూ సామాన్య ధర్మం. కాని రెండు పందిళ్ళు కూలినా, ఎవరికీ ఏమీ అపకారం జరుగకపోవటం శుభ శకునంగా తెలుసుకోవటం విశేష ధర్మం. ఇక

మీరు నిశ్చింతగా ఉండండి" అని చెప్పారు. ఆ నూతన దంపతుల జంటలు ఆ తరువాత సత్సంతాన సౌభాగ్యాలను పొంది గురుభక్తులై వర్ధిల్లుతున్నారు.

అప్పటి నుంచి శేషంరాజుగారు, కృష్ణవేణమ్మగారు అచంచల విశ్వాసంతో శ్రీ బాబు భక్తులైనారు. శ్రీ బాబు ఏ ఊళ్ళో పూజలు జరుపుతున్నా కృష్ణవేణమ్మగారు పిల్లలతో సహా వెళ్ళేవారు. వారికి యిద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు. కృష్ణవేణమ్మగారు తమ పిల్లలకు గురుభక్తిని ఉగ్గుపాలతోనే రంగరించి పోశారు.

హేమ, గయల వివాహాలు 1964 శ్రావణమాసంలో జరిగాయి. కొద్ది రోజులలోనే శ్రీకృష్ణజన్మాష్టమి పండుగ రాబోతున్నది. కృష్ణవేణమ్మగారి పుట్టిన రోజు కృష్ణాష్టమి.

అప్పటికి మూడు సంవత్సరాల నుండి వల్లభాపురంలో శ్రీ బాబు భక్తులు మాటూరి సోదరులు శ్రీ కృష్ణాష్టమి పూజలకు శ్రీ బాబును ఆహ్వానించి పూజలు జరుపుకుంటున్నారు. శ్రీ బాబు భక్తులందరు నాలుగైదు రోజులపాటు అక్కడే ఉండి శ్రీ గురు సన్నిధిలో మహాపర్వదినాలను సార్ధకం చేసుకొనే వారు. 1963 వరకు వల్లభాపురంలో శ్రీకృష్ణాష్టమి పూజలు జరిగాయి.

1964లో కృష్ణవేణమ్మగారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, శేషంరాజు దంపతులు, తమ గృహంలో శ్రీకృష్ణాష్టమి పూజలకు అనుగ్రహించి, దయచేయవలసినదని శ్రీ బాబును ప్రార్ధించారు. పిల్లల పెళ్ళిళ్ళు జరిగిన కొద్ది రోజులలోనే వారికి కలిగిన యీ సత్సంకల్పమునకు శ్రీ బాబు సంతోషంగా సమ్మతించారు.

ఫలితంగా 1964లో శ్రీకృష్ణాష్టమి పూజలు విజయవాడలో శేషంరాజు గారింట్లో ప్రారంభమైనాయి. ఆ యేడాది ఏడెనిమిది రోజులపాటు ప్రతిరోజు పూజలు, సత్సంగ సమావేశములు జరిగాయి. భక్తులు అసంఖ్యాకంగా వచ్చారు. శేషంరాజు దంపతులు అదొక మహోత్సవంగా జరిపి భక్తులను, శ్రీ బాబును కూడా భగవద్భావనతో సేవించుకున్నారు.

- సశేషం

## విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

# శ్రీ రమణ మహర్షి

ఒకరు శ్రీ అరవిందులను "ప్రతి వారికి గురువు ఉండాలి అంటున్నారు. శ్రీరమణునికి గురువేరి?" అని ప్రశ్నించారు. శ్రీ అరవిందులు "యోగ సామ్రాట్టులైన శ్రీరమణుని వంటి వారికి గురువు అవసరం లేదు" అని చెప్పారు.

మృత్యు అనుభవంతో వెంకట్రామన్ జీవితం పూర్తిగా మారిపోయింది. వైరాగ్యం అతన్ని వరించింది. ఒక నూతన శక్తి ఆవిర్భవించింది. అదే పరాభక్తి. ఆ భక్తి మాధుర్యన్ని శ్రీ రమణులే ఇలా వర్ణిస్తున్నారు.



"మృత్యు అనుభవంతో నాలో భక్తి జల ఆవిర్భవించి నన్ను ముంచెత్తి వేస్తోంది. నా శరీరం లో ఒక రకమైన మంట ఆరంభమైంది. మధుర మీనాక్షి, సుందరేశ్వరుల సన్నిధికి పరిగెత్తి మహాభక్తితో, కన్నీళ్ళతో "అనుగ్రహించండి" అంటూ ప్రార్థించేవాడిని. ఇట్టి భక్తి రుచిని మునుపెన్నడూ ఎరుగను. ఇంతేకాదు. ఎన్ని మందులకూ లొంగని మంట ఆ సన్నిధిలో వుపశమించేది. ఇంతకు పూర్వం ఆ మూర్తులు కేవలం శిలా విగ్రహాలు. ఇప్పుడో సహజ మూర్తులు, అందుచేత మాటి మాటికి గుడికి పరిగెత్తే వాడిని.

వెంకట్రామన్‌కి గుడి ఇల్లయింది. తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఒకనాడు తనూ, తన అన్నా చదువుకుంటున్నారు. వెంకట్రామన్ వ్రాస్తూ కనులు మూసుకొని సమాధి నిష్టుడయ్యాడు. "ఓ యతిరాజ్! యోగీశ్వరా! గృహ మధ్యంలో ఎందుకు? అరణ్యాలకు పోరాదా?" అని మందలించాడు అన్నగారు.

తమ్ముడికి అన్న మందలింపులో పరమేశ్వరుని పిలుపు వినిపించింది. వెంటనే లేచి నిలబడ్డాడు. ఎక్కడికి వెళ్ళడం? "అరుణాచలం, అరుణాచలం"

అని హృదయంలో మారు మ్రోగుతోంది. అన్న తన కాలేజీ జీతం కట్టమని ఆరు రూపాయలు ఇచ్చాడు. తమ్ముడు అన్న పేరున చీటి వ్రాసి గృహబంధాలను త్రెంచుకొని ఎగిరిపోయాడు. ఆ చీటీలో ఇలా ఉంది–

"నేను నా తండ్రి ఆజ్ఞను అనుసరించి ఆయనను (భగవంతుని) వెదుకుటకు బయలుదేరుతున్నాను. ఇది దైవ ప్రేరితమైన దివ్యకార్యం. దీని కొరకై పరితపించవలదు. నన్ను వెదుకుటకు ధనమును వ్యయపరచవలదు. నీ కాలేజీ జీతం కట్టలేదు. రెండు రూపాయలు ఇక్కడే ఉన్నవి".

1896 సెప్టెంబర్ 1 సూర్యోదయ సమయంలో బాలుడు వెంకట్రామన్ దురితహరము, పావనము, అయిన అరుణాచలంలో అడుగుపెట్టాడు. కైలాసగిరి శివుని ఆసనం. అరుణగిరి స్వయంగా పరమేశ్వరుడు.

బాలుడు అరుణాచలేశ్వరుని ఆలయానికి పరిగెత్తాడు. ఎందుకో ఆ సమయంలో దేవాలయ ద్వారాలన్ని గర్భగుడితో సహా బార్లాగా తెరిచి ఉన్నాయి. అది గుడి తెరిచే సమయం కాదు. అంత పెద్ద ఆలయంలో ఒక్క మనిషి కూడా లేడు. బాలుడు వాయువేగంతో దేవాలయ ద్వారాలన్ని దాటి గర్భగుడిలోకి లంఘించి పరంజ్యోతి స్వరూపం అయిన జ్యోతిర్లింగాన్ని గాఢాలింగనం చేసుకొని కన్నీటితో అభిషేకిస్తూ "అప్పా! నీ ఆజ్ఞ మేరకు వచ్చాను" అంటూ తన రాకను తెలుపుకొన్నాడు.

ఆ ఏకాంతంలో తండ్రీ కొడుకులు ఏమేమి మాట్లాడుకున్నారో! ఏం నిర్ణయించు కున్నారో వారికే ఎరుక. గాఢాలింగనంతో వెంకట్రామన్ లోని మంట శాశ్వతంగా అదృశ్యమైంది.

ఇంతటి పరిపూర్ణ శరణాగతి ఆధ్యాత్మిక చరిత్రలోనే అపూర్వం.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## మే నెల27 నుండి 29 వరకు శ్రీ కాళీవనాశ్రమం బెంగళూరుశాఖలో జరిగిన సత్సంగ సమావేశ దృశ్యములు



సత్సంగ సమావేశం



శ్రీ సద్గురు పాదపూజ



సిద్ధారూఢ జ్ఞాన మఠాధిపతి శ్రీ శివానంద భారతీస్వామిజీతో శ్రీ మాతాజీ

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No. : 37804/81
Postal Regd. No. : GTR/27/2021-2023



మే 6 శంకరజయంతినాడు శ్రీ సద్గురు పాదపూజ



మే 16 న వైశాఖ పౌర్ణమి నాడు శ్రీ సద్గురు పాదపూజ

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508,
Guntur Dist., A.P.